

కాకినాడ **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 37(మంగళవారం)
కనిష్ఠం : 28

ఏలేరు ఎడమ కాలువలో స్నానానికి దిగి విద్యార్థి గల్లంతు
7

డిస్పోజబుల్!



ప్రజారోగ్యంపై ప్లాస్టిక్ భూతం



ఇలా తెచ్చినా ప్రమాదమే సుమా : ప్లాస్టిక్ కవర్‌లో కూరగాయాలు

ఎవరు తీసిన గోతిలో వాళ్లే పడతారు.. ప్రస్తుత తరానికి ఈ సామెత అతికినట్టు సరి పోతోంది.. అనువుగా ఉంది కదా అని వినియోగానికి ప్లాస్టిక్ అనే గొయ్యి తవ్వుకున్నారు.. ప్రస్తుతం అందులో నుంచి బయటకు రాలేకపోతున్నారు.. అలాగని వదల్లేకపోతున్నారు..క్యాన్సర్ వంటి మహమ్మారి చుట్టుముడుతున్నా అదే తీరు.. మార్పు కానరావడంలేదు.. ఒకనాడు జనా వాసంలో ప్లాస్టిక్ వినియోగం లేదు.. క్యాన్సర్ కేసులు లేవు..ప్రస్తుతం వినియోగం పెరిగింది.. టీ తాగే కప్ నుంచి భోజనం చేసే ప్లేట్ వరకూ అంతా ప్లాస్టిక్కే.. దీంతో రకరకాల క్యాన్సర్ కేసు లు జనంపై దాడులు చేస్తున్నాయి.. చిన్న వయ సులోనే ప్రాణాలు తీస్తోంది.. అయినా మన జీవ న విధానంలో మార్పురావడంలేదు.. నేను ఆరోగ్యంపై చాలా శ్రద్ధ తీసుకుంటాను..నాకెలా క్యాన్సర్ వచ్చిందనే వాళ్లు ఒకసారి ఆలోచిస్తే అసలు కథ బోధపడుతుంది.. ఇకనైనా మారాల్సిందే.. ప్లాస్టిక్ వదిలేయాల్సిందే.. - (రాజమహేంద్రవరం/కాకినాడ-ఆంధ్రజ్యోతి)



చూశారా..చిత్రం : కాకినాడ దమ్ములపేట వద్ద డ్రెయినేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు

- పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం
- అరికట్టలేకపోతున్న అధికార గణం
- రోగాలకు గురవుతున్న జనం
- క్యాన్సర్‌తో బాధపడుతున్నవైనం
- రోజుకు 300 టన్నుల వ్యర్థాలు
- డంపింగ్‌యార్డుల నిండా అదే
- ఇకనైనా దృష్టి పెట్టాల్సిందే
- లేకపోతే సర్వనాశనమే

ప్లాస్టిక్ భూతం పర్యావరణాన్ని విచ్ఛిన్నం చేస్తోంది.ప్రజారోగ్యాన్ని పీల్చి పిప్పి చేస్తోంది. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే ఎన్నో అనర్థాలు కలుగుతాయని ఎన్ని అవగాహన కార్యక్రమాలు సాగుతున్నా ఉత్పత్తిదారులు, వినియోగదారుల్లో మా ర్పు రావడం లేదు. ఇక వాటిని నియంత్రించాల్సిన అధికారులు సైతం చూసీ చూడనట్టుగా వదిలేస్తున్నారు.దీంతో ప్లాస్టిక్ వినియోగం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిపోతోంది. ప్లాస్టిక్‌ను స్థానిక సంస్థలు నిషేధించినా.. అమలులో మాత్రం చిత్తశుద్ధి కొరవడింది. కింది స్థాయి సిబ్బందికి డబ్బులు వచ్చే మార్గంగా మారి పోయింది.దీంతో ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ సంచులు, కవర్లు ఉంటున్నాయి

ప్లాస్టిక్‌ను వదిలేద్దాం!

ఒక్క ప్లాస్టిక్ కవరు భూమిలో కలవడానికి పదేళ్లు పడుతుందట. ఈలోపు అది చేసే కీడు అనంతం. అందువల్ల పాలిథీన్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని మానుకోవాల్సిందే. ఇవాళ పాలి థీన్ సంచి అవసరమైతే చిన్న కిళ్లీ బడ్డీలో కూడా దొరుకుతుంది. నార సంచి కావాలంటే వెతుకు లాడాల్సిందే.ఈ పరిస్థితి మారాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు వాటిని ఉచితంగా పంపిణీ చేయడానికి చొరవ చూపాలి. బంగాళా దుంపలతో తయారు చేసిన సంచులను బ్రిటన్, జపాన్‌లో విరివిగా వాడుతున్నారు. బంగాళా దుంప నుంచి తీసే పిండి బయో పాలిమర్ ప్లాస్టిక్ లక్షణాలను కలిగి ఉంటుంది. కాబట్టి ఇది కొద్ది రోజులకే భూమిలో కలిసి పోవడం వల్ల పర్యావరణానికి హాని ఉండదు. ఇలాంటి ప్రత్యా మ్నాయాలపై తక్షణమే దృష్టి సారించాలి.



టీ కప్‌లో తుఫాన్..

ప్లాస్టిక్ టీ గ్లాసులు, వాటర్ బాటిళ్లు, పాలిథీన్ సంచులు వినియోగం బాగా పెరిగింది. టీ దుకాణాల వద్ద వేడి టీని పాలిథీన్ కవర్లలో వేస్తున్నారు.దాని వల్ల పాలిథీన్ కవర్ కరిగి ఆ టీలో కలిసిపోతుంది. అది తాగిన వారికి కొన్ని రోజులకు కాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. డిస్పోజబుల్ కప్‌లో చిన్న ప్లాస్టిక్ పొర ఉంటుంది.

క్యాన్సర్ కొనితెచ్చుకుంటున్నాం..

రోజులో మన వాడకాల్లో సగానికిపైగా ప్లాస్టిక్ భూతమే ఉంటోంది.పర్యావరణం,ప్రజల ఆరోగ్యాలను నాశనం చేస్తోంది. కంటికి కనిపించని ప్లాస్టిక్ రేణువులు రకరకాల క్యాన్సర్లకి కారణమవుతూ కుటుంబాల్లో ప్రళయాన్ని సృష్టిస్తున్నా యి.75 మైక్రాన్లలోపు మందం కలిగిన ప్లాస్టిక్ వినియోగించకూడదనే నిబంధన ఉన్నా ఎవరూ పాటించడం లేదు.75 నుంచి 120 మైక్రాన్ల కంటే తక్కువ పరిమాణం ఉన్న పాలిథీన్ కవర్లను ఎక్కడ పడితే అక్కడ విక్రయిస్తున్నారు.వీటిని నియంత్రించిన అధికారు లు చోద్యం చూస్తున్నారు. ప్రజలు వినియోగించిన పాలిథీన్ కవర్లను రోడ్లపై వేయడంతో అవి మూగజీవాలు తిని మృత్యువాత పడుతున్నాయని జంతుప్రేమికులు ఆందోళన చెందుతున్నారు.

ఇదీ సర్వే మాట

మనం వాడి పడేస్తు న్నాం.. మనకేంటి.. అని సంబర పడుతుంటే ప్లాస్టిక్ వ్యర్థాల్లో కాలు వేసి నట్లే. ప్లాస్టిక్ సంచుల్లో కూరలు, కూరగాయలు, టీ తదితర ఆహార పదార్థాలు తీసుకురావడం. ప్యాకేజింగ్‌కి ప్లాస్టిక్ సంచులను వాడడం, ప్లాస్టిక్ కోటింగ్‌తో తయారు చేసిన కృత్రిమ ఆకులు, గ్లాసులను, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని విని యోగించడం వంటి వాటి వల్ల ఒక మనిషి శరీరంలోకి వారానికి సగటున 5 గ్రాముల మైక్రో ప్లాస్టిక్ రేణువులు చేరుతున్నాయని ఓ సర్వే భయంకరమైన నిజాన్ని బయట పెట్టింది. ప్లాస్టిక్ తయారీకి ముడి చమురును మూల పదార్థంగా వాడతారు. వివిధ ఆకృతులు, రం గులు రావడానికి ఎన్నో రసాయనాలు కలు పుతారు. వాటిలో సీసం, కాడ్మియం తదితర రసాయనాల వల్ల రకరకాల క్యాన్సర్లు, హార్మోన్ అసమతుల్యత, గర్భం దాల్చడంలో ప్రతికూల తలు, చర్మ వ్యాధులు, శారీరక, మానసిక ఎదు గుదలపై ప్రతికూల ప్రభావం.. ఇలా రకరకాల దారుణ రుగ్మతల బారిన పడుతున్నామని వివిధ సర్వేలు చెవిలో పోరు పెడుతేన్నాయి.

ఉమ్మడి జిల్లాలో 300 టన్నులు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా రోజుకు సగటున సుమారు 600 టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వాటిలో కనీసం 300 టన్నులపైనే ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటు న్నాయి. ఎక్కడైనా డంపింగ్‌యార్డ్ వద్దకు వెళ్లి చూడండి.. అంతెందుకు గోదావరి గట్టుకు వెళ్లి చూడండి ప్లాస్టిక్ కనిపించకుండా చెత్త ఉండదు.హోల్‌సేల్ దుకాణాల ద్వారా రోజూ కనీసం టన్ను వరకూ పాలిథీన్ కవర్లు జనాల్లోకి వెళుతున్నాయని ఓ అంచనా ఉంది. స్వచ్ఛభారత్ వంటి పురస్కారాల కోసం ఈ ప్లాస్టిక్ వ్యర్థాల లెక్కను తొక్కిపడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్లాస్టిక్ వస్తువు లేని ఇల్లు లేదు, ప్లాస్టిక్ వ్యర్థాలు లేని డ్రెయినూ కనబడదంటే అతిశయోక్తి కాదేమో!.



కాకినాడలో డెయిరీఫాం సెంటర్ వద్ద ఇలా..



కాకినాడ జిల్లా పిఠాపురంలో ఆర్‌అండ్‌బీ రహదారి

దారి మారు!

రహదారులపై కోట్లు పోస్తున్న ప్రభుత్వం

- అన్ని దారుల వైపు చూపు
- రోడ్లపై సాఫీగా ప్రయాణం
- 10 నెలల్లో రోడ్లు బాగుబాగు
- నాబార్డు నిధులు విడుదల
- 16 రోడ్లకు రూ.29.92 కోట్లు
- టెండర్లు పిలవాలని ఆదేశం

(ఆంధ్రజ్యోతి, పిఠాపురం)

రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పుష్కలంగా నిధులు కేటాయిస్తోంది. ఇప్పటికే ఆర్‌అండ్‌బీ రహదారులకు రూ.200కోట్లకు పైగా విడుదల చేసింది.. మరో వైపు ఉమ్మడి జిల్లాలోని 39 పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధి నిమిత్తం రూ.73.15 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 76.188 కిలోమీటర్ల పొడవునగల 16 రహదారుల అభివృద్ధికి నాబార్డు నిధులు రూ.29.92 కోట్లను విడుదల చేస్తూ జీవో జారీ చేసింది.ఈ మేరకు టెండర్లు పిలవాలని ప్రభుత్వం ఆదేశించింది.వర్షాకాలం నాటికి రాష్ట్రంలో రహదారులపై ఎక్కడ గుంతలు కనబడకూడదని సీఎం చంద్రబాబు అధికారులకు నిర్దిష్టంగా ఆదేశాలిచ్చారు. ఆర్‌అండ్‌బీశాఖ తాత్కాలిక, శాశ్వత కార్యాచరణలు సిద్ధం చేసుకుని తదనుగుణంగా పనులు చేపడుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే రహదారుల మరమ్మతుల పనులు చేపట్టి 75 శాతం వరకూ పూర్తి చేసింది. మిగిలిన పనులు వర్షాలు రాకుండా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

కాకినాడకు రూ.13.20 కోట్లు

- నాబార్డు ఆర్‌ఐడీఎఫ్ 30వ విడత ద్వారా కాకినాడ జిల్లాలో 37.516 కిలోమీటర్ల పొడవు గల ఆరు రహదారుల అభివృద్ధికి రూ.13.20 కోట్లు మంజూరు చేశారు. తిప్పరాజుపాలెం-కాజులూరు రోడ్డుకు రూ3.10 కోట్లు, రావికంపాడు-రమణక్కపేట రోడ్డుకు రూ.2 కోట్లు, యండపల్లి జంక్షన్-నాగులా పల్లి-రావివారిపోడు రోడ్డుకు రూ.3.50 కోట్లు,జెడ్.రాగంపేట ఎన్‌హెచ్ నుంచి నాయకంపల్లి రోడ్డుకు రూ.60లక్షలు,ఏలేశ్వరం-జడ్డంగి లింక్ రోడ్డుకు రూ.కోటి,కట్టమూరు-కాండ్రకోట-జె.తిమ్మాపురం రోడ్డుకు రూ.3 కోట్లు.

తూర్పుగోదావరి జిల్లాకు..

- తూర్పుగోదావరి జిల్లాలో 26.807 కిలోమీటర్ల పొడవు గల 8 రహదారుల అభివృద్ధికి రూ.12.50 కోట్లు కేటాయించారు. ఆర్‌కేరోడ్డు శాటిలైట్ సిటీ-సంపత నగరం-జి.యర్రంపాలెం-కొత్తతుంగపాడు రోడ్డుకు రూ.2 కోట్లు, పెద్దాపురం ఏడీబీ రోడ్డు-నాయకంపల్లి-జి.దొంతమూరు రోడ్డుకు రూ.80 లక్షలు, వీరవరం-దుళ్ల రోడ్డుకు రూ.1.80 కోట్లు, రాజవోలు-వేమగిరి-కడియం-కొత్తూరు రోడ్డుకు రూ.50 లక్షలు, యర్రాయిచెరువు-పి.వేమవరం రోడ్డుకు రూ. 1.26 కోట్లు, వడ్లూరు-తీపర్రు రోడ్డుకు రూ.3.24 కోట్లు, తేతలి-మునిపల్లి రోడ్డుకు రూ.60 లక్ష లు, పశివేదల-ఆరికిరేవుల రహదారి అభివృదికి రూ.2.30 కోట్లు మంజూరయ్యాయి.

కోనసీమ జిల్లాకు..

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 11.865కిలోమీటర్ల పొడవు గల రెండు రహదారుల అభివృద్ధికి రూ.4.22 కోట్లు కేటాయించారు. శివకోడు-రామరాజులంక, లక్కవరం-శంకరగుప్తం, శివకోడు మునలమ్మ ఆలయం నుంచి విశ్వేశ్వరరాయపురం రోడ్ల అభివృద్ధికి రూ.2.50కోట్లు,గోపాలపురం నుంచి గంటిలొల్ల రోడ్డు,గోపాలపురం-పొడగట్లపల్లి రోడ్డు, గంటి-గోపాలపురం పుష్కరఘాట్-పొడగట్లపల్లి రోడ్ల అభివృద్ధికి రూ.1.72 కోట్లు మంజూరు చేశారు.



ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు సత్యప్రసాద్, రవికుమార్, ఎమ్మెల్యే చినరాజప్ప

ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుతో..

ఆర్థిక పరిపుష్టి

- మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్
- పెద్దాపురంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు శంకుస్థాపన
- రూ.13కోట్లతో 29 ఎకరాల్లో నిర్మాణానికి భూమిపూజ

పెద్దాపురం, మే 13(ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుతో రాష్ట్రం ఆర్థికంగా పరిపుష్టి చెందడంతోపాటు యువతకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుందని మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పెద్దాపురం ఏడీబీ రహదారిలో రూ.13 కోట్ల వ్యయంతో 29.87ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకోనున్న తుమ్మల రామస్వామి(బాబు), కలెక్టర్ షాన్‌మోహన్‌తో కలిసి మంగళవారం వారు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు భవిష్యత్ తరాల కోసం ఆలోచన చేసే నాయకుడన్నారు. ఉపాధి కల్పనతోపాటు ఆర్థికంగా రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా నిలిపేందుకు ప్రతి కుటుంబానికి ఒక పారిశ్రామికవేత్త అనే నినాదాన్ని చంద్రబాబు తీసుకువచ్చారన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. యువతను పారిశ్రామికంగా ప్రోత్సహించేందుకు పెద్దఎత్తున రాయితీలను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రధాని మోదీ మేక్ ఇన్ ఇండియా పిలుపు మేరకు స్థానికంగా పరిశ్రమలను స్థాపించి యువతకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో పెద్దాపురంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కు పెద్దది అన్నారు. పార్కును ప్లాట్లుగా విభజించి పరిశ్రమ స్థాపనకు అవసరమైన రోడ్లు, విద్యుత్, నీరు వంటి సౌకర్యాలను కల్పిస్తామన్నారు. రానున్న సంవత్సర కాలంలో ఈ పార్కు నిర్మాణ పనులు పూర్తిచేయడంతోపాటు అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) మాట్లాడుతూ పెద్దాపురంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు కావడం చాలాఆనందంగా ఉందన్నారు. ఈ పార్కు ఏర్పాటు ద్వారా 5వేల మంది యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జేసీ రాహుల్ మీనా, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ అబ్బిరెడ్డి రమణారెడ్డి, ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి, డీఎల్‌డీవో కేవన్వీ ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజాసూరిబాబురాజు పాల్గొన్నారు.

పాఠశాలల విభజన



- పాఠశాలల పునర్నిర్మాణం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు
- తొమ్మిది రకాలుగా విభజన
- జీవో నెంబర్ 19 ద్వారా ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు

తొండంగి, మే 13(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబరు 117పై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలనుంచి వచ్చిన తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పాఠశాలలను పునర్నిర్మాణం చేస్తూ మంగళవారం జీవో నెంబరు 19ను విడుదల చేసింది. దీనిద్వారా విద్యార్థుల నమోదు పెంచడం, డ్రాపౌట్ల రేటు, ఉపాధ్యాయుల పనిభారం తగ్గించడం, విద్యా ఫలితాలు మెరుగు పర్చడం లక్ష్యంగా పెట్టుకున్నారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నడిచే పాఠశాలల్లో దీన్ని అమలు పరిచేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విధమైన పాఠశాలల ఏర్పాటు ద్వారా అన్ని ప్రాంతాల్లోని విద్యార్థులకు అనువైన రీతిలో అందుబాటులో పాఠశాలలు ఉండేలా పునర్నిర్మాణం చేపట్టారు. దీనికి సంబంధించి ఆయా పాఠశాలల్లో ఉండాల్సిన ఉపాధ్యాయుల సంఖ్యను, ప్రధానోపాధ్యాయుల పోస్టు వివరాలతో కూడిన సమగ్ర ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటికే ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో పాఠశాలల పునఃనిర్మాణం ద్వారా మంజూరైన పోస్టులు కూడా బదిలీల్లో భర్తీ కానున్నాయి.

పాఠశాలల పునర్నిర్మాణం ఇలా...


1. శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్(పిపి1, పిపి 2): ఒక కిలోమీటర్ పరిధిలో ప్రాథమిక పాఠశాలలు లేని ప్రాంతాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్స్‌గా పనిచేస్తాయి.
2. ఫౌండేషన్ స్కూల్స్ (పిపి1, పిపి2 క్లాస్1, 2): అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలోని 1, 2 తరగతులు కలిసి ఫౌండేషన్ స్కూల్స్‌గా ఏర్పాటు చేస్తారు.
3. బేసిక్ ప్రైమరీ స్కూల్స్(పిపి1,2తో పాటు 1 నుంచి 5 తరగతులు): 1 నుంచి 5వ తరగతి వరకూ 59మంది వరకూ విద్యార్థులు ఉన్న పాఠశాలలను బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా పరిగణిస్తారు.
4. మోడల్ ప్రైమరీ పాఠశాలలు(పిపి1,2 క్లాస్ 1 నుంచి 5 వరకూ): 1 నుంచి 5 తరగతి వరకూ 60 లేదా అంతకంటే ఎక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా పరిగణిస్తారు.
5. అప్పర్ ప్రైమరీ పాఠశాలలు(పిపి1,1,2, క్లాస్ 1 నుంచి 8 వరకూ): క్లాస్ 1 నుంచి 5 వరకూ బేసిక్, మోడల్ ప్రైమరీ స్కూల్‌గా 6 నుంచి 8 వరకూ అప్పర్ ప్రైమరీ స్కూల్స్‌గా పరిగణిస్తారు.
6. హైస్కూల్ (క్లాస్ 6నుంచి 10 వరకూ): క్లాస్ 6 నుంచి 10 వరకూ విద్యను అందించే పాఠశాలలను హైస్కూళ్లుగా పరిగణిస్తారు.
7. హైస్కూల్(1నుంచి 10 వరకూ): క్లాస్ 1 నుంచి 5 వరకూ, 6 నుంచి 10 వరకూ విద్యను అందించే పాఠశాలలు హైస్కూల్స్‌గా పరిగణిస్తారు.
8. హైస్కూల్ ప్లస్(క్లాస్ 6 నుంచి 12 వరకూ): క్లాస్ 6 నుంచి 12 వరకూ విద్యను అందించే పాఠశాలలు హైస్కూల్ ప్లస్‌గా పనిచేస్తాయి.
9. హైస్కూల్ ప్లస్(1 నుంచి 12 వరకూ): క్లాస్ 1 నుంచి 12 వరకు విద్యను అందించే పాఠశాలలను హైస్కూల్ ప్లస్ పాఠశాలలుగా పరిగణిస్తారు.

విపత్తులు సమర్థంగా ఎదుర్కొనేందుకు..

16న కలెక్టరేట్‌లో మాక్ డ్రిల్

- జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), మే 13(ఆంధ్రజ్యోతి): భవనాలు కూలడం, అగ్నిప్రమాదాలు వంటి విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు జిల్లా రక్షణ, సహాయ యంత్రాంగం సంసిద్ధతకు ఈనెల 16న కాకినాడ కలెక్టరేట్‌లో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా ఎమర్జెన్సీ ఆపరేషన్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విపత్తుల నియంత్రణ సంస్థ సూచనల ప్రకారం శత్రుదాడులవల్ల గానీ, ఆకస్మికంగా భవనాలు కుప్పకూలడం, అగ్ని ప్రమాదాలు జరిగితే సివిల్ డిఫెన్స్ ప్రిపేర్డ్‌నెస్‌కు, పౌరరక్షణకు తక్షణం స్పందించేందుకు డిస్ట్రిక్ట్ ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఇది రెవెన్యూ, అగ్నిమాపక, వైద్య ఆరోగ్యం, రవాణా, పౌరసరఫరాలు, విద్యుత్, పశుసంవర్థక, పంచాయితీ, విద్యాశాఖల సమన్వయంతో పనిచేస్తుందన్నారు. ఈనెల 16న ఉదయం 11గంటలకు కాకినాడకలెక్టరేట్ ప్రాంగణంలో మాక్‌డ్రిల్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మాక్‌డ్రిల్‌లో పరిశీలించిన అంశాల ఆధారంగా రక్షణ, సహాయ వ్యవస్థలను మరింత దృఢంగా చేస్తామన్నారు. కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, డీఈఓసీ నోడల్ అధికారి భారతి, జిల్లా అగ్నిమాపక అధికారి రాజేష్, డీటీసీ శ్రీధర్ పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

నేత్రపర్వంగా సత్యదేవుడి శ్రీ పుష్పయాగం 7

‘పాదగయ’లో సుదర్శన హోమం 6
- సైన్యానికి, దేశ నాయకత్వానికి దైవ బలం ఉండాలని పూజలు
- పురుహూతికా అమ్మవారికి పట్టువస్త్రాలు పంపిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

ఆది ఊరు.. అభివృద్ధి ఊసేలేదు! 6



పాదగయలో పూజల్లో పాల్గొన్న తుమ్మల రామస్వామి (బాబు), జనసేన నేత శ్రీనివాసరావు

పాదగయలో సుదర్శన హోమం

సైన్యానికి, దేశ నాయకత్వానికి దైవ బలం ఉండాలంటూ పూజలు

పురుహూతికా అమ్మవారికి పట్టువస్త్రాలు పంపిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పిఠాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పిన భారత సైన్యానికి, దేశ నాయకత్వానికి దైవ బలం మెండుగా ఉండాలని కోరుకుంటూ పట్టణంలోని పాదగయ క్షేత్రంలో మంగళవారం జనసేన నాయకులు పూజలు, హోమాలు నిర్వహించారు. రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి, అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్టాన దేవత పురుహూతికా అమ్మవార్ల సన్నిధిలో సుదర్శన హోమం జరిగింది. పురుహూతికా అమ్మవారికి ఖడ్గమాల కుంకుమార్చన, స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి వార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన పట్టు వస్త్రాలను డీసీసీబీ ఛైర్మన్‌గా నియమితులైన తుమ్మల రామస్వామి (బాబు), పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పురుహూతికా అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఉచిత ప్రసాద వితరణ జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్, జనసేన నాయకులు కడారి తమ్మయ్యనాయుడు, చల్లా లక్ష్మి, డాక్టర్ వరలక్ష్మి, మురాలశెట్టి సునీల్‌కుమార్, సూరవరపు సురేష్, చెల్లుబోయిన సతీష్, జోగా రమణ, ఆగంటి ప్రభాకరరావు, కరణం సూరిబాబు, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.





సుదర్శన హోమంలో పాల్గొన్న జన సైనికులు, పురుహూతికా అమ్మవారికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దృశ్యం

బిక్కవోలులో సుబ్రహ్మణేశ్వర స్వామికి లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు

పాల్గొన్న పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



లక్ష్మీగణపతి స్వామికి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు చేస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



బిక్కవోలు, మే 13 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో అమాయకులను పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదులపై భారత సైన్యం చేస్తున్న పోరాటం... ఒక మతం, దేశంపై చేస్తున్నది కాదని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు మంగళవారం ఆయన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలులోని శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అంతకు ముందు ఆయన జనసైనికులతో కలిసి బస్సులో వచ్చి ముందుగా గ్రామంలోని శ్రీలక్ష్మీగణపతిని దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలనంతరం ఆలయం ముందు హారతులిచ్చి విలేకరులతో మాట్లాడారు. దేవతలకు సర్వసైన్యాధ్యక్షుడు సుబ్రహ్మణ్యస్వామి అని ఆయన సురులను అసురుల నుంచి కాపాడారన్నారు. దుష్ట ముష్కరులు మన దేశంపై దాడి చేస్తే కాపాడిన నిజమైన సైన్యాధ్యక్షులు మన భారత సైనికులన్నారు. వారు చూపిస్తున్న తెగువ, త్యాగాలను దృష్టిలో వుంచుకుని వారికి ఆత్మస్థైర్యం, ధైర్యం ఇవ్వాలని, ప్రధాని మోదీ ఈ దేశాన్ని రక్షించడానికి, సమైక్యంగా వుంచడానికి చేస్తున్న ప్రయత్నానికి బాసటగా నిలబడతామంటూ దక్షిణాపథాన వున్న అన్ని షణ్ముఖ క్షేత్రాల్లో అభిషేకాలు చేయాలని పవన్‌కల్యాణ్ ఆదేశాలలో తాము పూజలు చేస్తున్నామన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వున్న ఈ విశాల భారతదేశంలో భిన్న మతాలు, భిన్న భాషలు మాట్లాడేవారు, భిన్న సంస్కృతులు కలవారు వున్నారన్నారు. వీరందరినీ కలగలిపి ఒకటిగా నిలబెట్టి భిన్నత్వంలో ఏకత్వం తీసుకువస్తున్న ప్రధాని మోదీ చేతులకు బలం చేకూర్చాలని ద్వారా ఈ దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని, శాంతి కాముకంగా వున్న ఈ దేశంలో ఎలాంటి అరాచకాలు జరగకుండా వుండాలని ప్రార్థించామన్నారు. తీవ్రవాదులు మనపై దండెత్తితే ఏవిధంగా ప్రతీకారం చూపగలమో ఆపరేషన్ సిందూర్ ద్వారా చూపగలిగామన్నారు. తెగబడుతున్న ఉగ్రవాదులను పూర్తి స్థాయిలో ఉపేక్షించమని నిరూపించేలా కార్యక్రమాలు చేశామని, దీనికి దైవబలం కూడ తోడవ్వాలనే ఆలోచనతో కేవలం హిందూ దేవాలయాలే కాక మసీదు, చర్చిల్లో కూడా జనసేనకు చెందిన వివిధ మతాల వారు ఇలాంటి పూజలు చేయాలని కోరామన్నారు. ఒకే మాట, ఒకే దేశం, ఒకే పద్ధతిగా వెళ్లాలని, అన్ని కులాలు, మతాల వారిని కలుపుకుని ముందుకు వెళ్లాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు దైవ బలం తప్పనిసరిగా ఆశీర్వాదం ఇస్తుందని నమ్ముతూ దేశ సమగ్రతకు అందరూ కృషి చేయాలని మంత్రి దుర్గేష్ కోరారు. అనంతరం గ్రామంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. తూర్పు చాళుక్యుల కాలంలో నిర్మించిన బిక్కవోలులోని ప్రాచీన ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రి దుర్గేష్‌కు ఎమ్మెల్యే నల్లమిల్లి వినతిపత్రం అందజేశారు. ఏపీటీడీసీ డైరెక్టర్ గంటా స్వరూప, మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు ప్రియసౌజన్య, జనసేన అనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, రాజమహేంద్రవరం నగర శాఖ అధ్యక్షుడు వై.శ్రీనివాస్, టీడీపీ ఇన్‌చార్జి మనోజ్‌రెడ్డి, రావాడ నాగు తదితరులు పాల్గొన్నారు.



బిక్కవోలులో శాంతి ర్యాలీలో పాల్గొన్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, కూటమి నేతలు

చారిత్రక ప్రాధాన్యత కలిగి ఉన్న పురాతన ఆది బౌద్ధ స్థూపం అభివృద్ధికి నోచుకోకుండా పోయింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం ఆదుర్రు గ్రామంలోని ఆది బౌద్ధ స్థూపాన్ని ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. అంతర్జాతీయ ప్రాధాన్యత కలిగిన ఈ బౌద్ధ స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.







బర్మా దేశం నుంచి బుద్ధిస్టులు పంపిన బుద్ధుని పాలరాతి విగ్రహం (ఎడమ), తైవాన్ దేశం నుంచి వచ్చిన విలువైన బుద్ధుడి కాంస్య విగ్రహం (కుడి)



ఆదుర్రులోని బౌద్ధ స్థూపం. దాని చుట్టూ ఉన్న ఉప స్థూపాలు

ఆది ఊరు... అభివృద్ధి ఊసే లేదు!

- ఆదుర్రు బౌద్ధ క్షేత్రాన్ని పట్టించుకోని పాలకులు, అధికారులు
- పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలంటున్న స్థానికులు

(మామిడికుదురు-ఆంధ్రజ్యోతి)

అశోక చక్రవర్తి నిర్మించిన 84వేల బౌద్ధ స్థూపాలను 60 మహా స్థూపాలుగా, మూడు దివ్య స్థూపాలుగా తీర్చిదిద్దారు. ఈ మూడు దివ్య స్థూపాల్లో మొదటిది ఆదుర్రులోను, రెండోది సాంచీలోను, మూడోది సారనాథ్‌లో ఉన్నట్టు చరిత్ర తెలియచెప్తోంది. ఆదుర్రులోని బౌద్ధ స్థూపాన్ని అశోక చక్రవర్తి కుమార్తె సంఘమిత్ర సముద్ర యానం ద్వారా వచ్చి నిర్మాణాన్ని పర్యవేక్షించినట్టు చరిత్ర చెప్తోంది. వైనతేయ నదీతీరంలో 74 ఏళ్ల క్రితం ఈ బౌద్ధ స్థూపం బయల్పడింది. నాడు ఆది ఊరుగా పిలవబడిన గ్రామం నేడు ఆదుర్రుగా మారింది.

పూర్వం గ్రామంలో ఈ దిబ్బను దూబరాజు దిబ్బగా పిలిచేవారు. వ్యవసాయ పనుల నిమిత్తం ఈ దిబ్బను స్థల యజమాని తవ్వుతుండగా పెద్ద పెద్ద ఇటుకలు బయటపడ్డాయి. పనివారిలో బర్మా వెళ్లి వచ్చిన ఒకరు అవి బుద్ధునివని తెలపగా ప్రభుత్వానికి ఈ విషయం స్థానికులు తెలియజెప్పారు. ప్రభుత్వం 1953లో రక్షిత ప్రాంతంగా ప్రకటించింది. అనంతరం ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన తవ్వకాల్లో బుద్ధుని అవశేషాలు ఆనాటి మట్టి పాత్రలు, పిడతలు లభ్యం కాగా వాటిని చెన్నై, హైదరాబాద్‌ల్లోని మ్యూజియంలకు తరలించారు. తవ్వకాల్లో బయల్పడిన స్థూపం పెద్దపెద్ద ఇటుకలతో నిర్మితమై ఇరువైపులా అశోకచక్రం ఆకారంలో రెండు ధ్యాన మందిరాలు, ఉప స్థూపాలు, చైత్యాలు బయల్పడ్డాయి. బర్మా, జపాన్, టిబెట్, శ్రీలంక, చైనా, తైవాన్ తదితర దేశాలనుంచి బౌద్ధ భిక్షువులతోపాటు మన దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన భిక్షువులు ఇక్కడికి వచ్చి స్థూపం విశిష్టతను తెలుసుకుని ప్రత్యేకప్రార్థనలు చేస్తారు. బౌద్ధ స్థూపం సమీపంలో బుద్ధవిహార్ ట్రస్టు ఏర్పాటుచేసిన షెడ్డులో బర్మా నుంచి వచ్చిన పాలరాతి విగ్రహంతో పాటు బుద్ధుడు తపస్సు చేసి చిక్కిశల్యమైన శరీరాన్ని తెలియచేసేలా తయారుచేసిన విగ్రహం పర్యాటకులను ఆకట్టుకుంటాయి.

పురాణ ప్రశస్తి కలిగిన బౌద్ధస్థూపం అభివృద్ధిలో స్థానిక బుద్ధవిహార్ ట్రస్టు, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా చేస్తున్న కృషి కీలకం. బుద్ధవిహార్ ట్రస్టు మెంబర్ సెక్రటరీ ఎస్ఎస్ఆర్ భూపతి, కుటుంబసభ్యులు సమకూర్చిన రూ.8 లక్షలతో బౌద్ధ భిక్షువుల వసతి కోసం అతిథిగృహ నిర్మాణాన్ని ఇటీవల చేపట్టారు. బౌద్ధ స్థూపం కీర్తిని తెలియచేయడానికి బుద్ధవిహార్ ట్రస్టు, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అంతర్జాతీయ ప్రాచీన భారతీయ వారసత్వ బౌద్ధ సాంస్కృతిక ఉత్సవం పేరిట ప్రతిఏటా ఇక్కడ పలు కార్యక్రమాలు నిర్వహించి స్థూపం ఖ్యాతిని దేశ, విదేశాలకు విస్తరింపజేస్తోంది.

ఆదుర్రు బౌద్ధ స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. బౌద్ధ స్థూపాన్ని సందర్శించడానికి వచ్చే బౌద్ధ భిక్షువులు, యాత్రికులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. పాశర్లపూడి నుంచి బౌద్ధ స్థూపం వరకు ఏటిగట్టు రోడ్డును ఆధునికీకరిస్తే అధిక సంఖ్యలో యాత్రికులు బౌద్ధ స్థూపాన్ని సందర్శించడానికి వీలు కలుగుతుందంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పురాతన చరిత్ర కలిగిన బౌద్ధ స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి చారిత్రక నేపథ్యం కలిగిన స్థూప విశిష్టతను దేశ, విదేశాలకు వ్యాప్తి చెందేలా కృషి చేయాలని బుద్ధవిహార్ ట్రస్టు సభ్యులతో పాటు స్థానికులు కోరుతున్నారు.

బౌద్ధ స్థూపం అభివృద్ధికి స్థానికుల తోడ్పాటు

బౌద్ధ స్థూపం అభివృద్ధిలో స్థానికులు పలువురు దాతలు విరాళాలతో సమీపంలోని 40 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఈ స్థలంలో ధ్యాన మందిరం షెడ్డు ఏర్పాటుచేసి బుద్ధుని విగ్రహాలను ప్రతిష్ఠింపజేసి బుద్ధ జయంతి, పలు ప్రత్యేక రోజుల్లో విశిష్ట ప్రార్థనలు నిర్వహిస్తారు. ఓఎన్జీసీ ఆన్‌షోర్ బౌద్ధ స్థూపం అభివృద్ధికి రూ.4లక్షలు కేటాయించడంతో ప్రహరీ, లైబరీ, మరుగుదొడ్లు నిర్మించారు. రాజమహేంద్రవరం, కాకినాడలకు చెందిన ఓఎన్జీసీ సంస్థ కేటాయించిన రూ.10.70 లక్షల వ్యయంతో టాయిలెట్ బ్లాక్‌ను ఇటీవల నిర్మించారు.

స్థానికుల విరాళాలతో నిర్మితమవుతున్న అతిథి గృహం



నన్నయలో బొటానికల్ గార్డెన్ ఏర్పాటు



నన్నయ వర్శిటీ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న వీసీ, తదితరులు

అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శివరామ ప్రసాద్

దివాన్‌చెరువు, మే13 (ఆంధ్రజ్యోతి): అరుదైన మొక్కలతో ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయంలో బొటానికల్ గార్డెన్‌ను ఏర్పాటు చేస్తామని అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎన్‌వీ శివరామ ప్రసాద్ అన్నారు. యూనివర్శిటీ ప్రాంగణాన్ని వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ తో కలసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ వీసీ ఆహ్వానం మేరకు విశ్వవిద్యాలయాన్ని పరిశీలించామన్నారు. వృక్షశాస్త్రం విద్యార్థులకు విద్య, పరిశోధనలకు ఉపయోగపడే విధంగా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. వర్శిటీ ప్రాంగణాన్ని పూర్తిగా పరిశీలించి అవసరమైన ప్రాంతంలో మొక్కలు నాటుతామన్నారు. వీసీ సూచన మేరకు విశ్వవిద్యాలయాన్ని వర్షాకాలం నాటికి ప్రకృతిఒడిగా తీర్చిదిద్దుతామని చెప్పారు. వీసీ మాట్లాడుతూ యూనివర్శిటీ ప్రాంగణంలో మొక్కలు పెంపకంతో అహ్లాదకరమైన, ఆరోగ్యవంతమైన వాతావరణం లభిస్తుందన్నారు. నన్నయ ప్రాంగణం రాతినేల కావడంతో వేడి ఎక్కువగా ఉంటుందని, ఈ ప్రాంతంలో విస్తారంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించవలసిన అవసరాన్ని గుర్తించామన్నారు. కార్యక్రమంలో యూనివర్శిటీ డీన్ బి.జగన్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భావనారాయణస్వామి శ్రీపుష్పయాగం



ప్రత్యేక అలంకరణలో భావనారాయణస్వామి

సర్పవరం జంక్షన్, మే 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సర్పవరంలోని వేంచేసియున్న రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీపుష్ప యాగం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ఆలయ పండితులు పలు రకాల పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఉత్సవమూర్తులకు పలు రకాల ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు, పుష్ప కైంకర్యం, స్నపనం అభిషేకం నిర్వహించి అర్చనలు చేశారు. అనంతరం ద్వాదశ ప్రదక్షిణలు (బేడా ఉత్సవం) చేశారు. ముగింపులో భాగంగా శయనోత్సవం నిర్వహించి విశేష పవళింపు సేవ పూర్తి చేశారు. ఈవో ఎం.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో 1008 మందికి దంపత తాంబూలాలు అందించారు. కాకినాడ రూరల్, సిటీ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తుల ఆకాంక్షల మేరకు బుధవారం రాత్రి ఏడు గంటలకు ముక్తికా సరస్సులో తొలిసారిగా స్వామివారి తెప్పోత్సవం ఏర్పాటు చేసినట్టు ఈవో చెప్పారు.

సత్యదేవుడి సన్నిధిలో హైకోర్టు జడ్జి ప్రత్యేక పూజలు



అన్నవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాండవ కిరణ్మయి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

అప్సరలో సింగిల్ బృందం సందడి



అప్సర థియేటర్‌లో సింగిల్ సినిమా చిత్ర బృందం

రాజమహేంద్రవరం కల్చరల్, మే 13(ఆంధ్రజ్యోతి): నిర్మాత అల్లు అరవింద్ గీతా ఆర్ట్స్ సమర్పణలో శ్రీవిష్ణు హీరోగా నటించిన సింగిల్ సినిమా ఆంధ్ర, తెలంగాణాలలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న సందర్భంగా చిత్ర బృందం విజయోత్సవ యాత్ర నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా స్థానిక అప్సర థియేటర్‌ని సందర్శించిన చిత్ర యూనిట్ హీరో శ్రీవిష్ణు, హీరోయిన్లు కేతిక శర్మ, ఇవానా, వెన్నెల కిశోర్‌లను గీతా ఫిలిమ్స్ మేనేజర్ వెంకటేశ్వరరావు మేళతాళాలతో డప్పు వాయిద్యాలతో ఆహ్వానం పలుకగా ప్రేక్షకులు కేరింతలతో స్వాగతం పలికారు. హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ ఈ నెల 9న విడుదలైన సింగిల్ చిత్రాన్ని విజయవంతం చేసి, మంచి కలెక్షన్లతో ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. మున్ముందు కూడా ఇలానే ఆదరించాలని కోరారు. సింగిల్ సినిమా ఎలా ఉంది? కామెడీ అదిరిందా? బాగా ఎంజాయ్ చేస్తున్నారా? అంటూ ప్రేక్షకులతో ముచ్చటించిన శ్రీవిష్ణు, ప్రేక్షకులు సినిమా బాగుందని, కామెడీ ఇంకా బాగుందంటూ వచ్చిన అనూహ్య స్పందనకు అభివాదం చేశారు. వెన్నెల కిషోర్ ప్రేయసి పాత్ర గాయత్రి గురించి సినిమాలో హీరో విష్ణు పదేపదే ప్రస్తావించడం ప్రేక్షకుల్లో జోష్ నింపింది. చిత్రంలో తమ అందచందాలతో అలరించి, అపూర్వగా నటించిన కేతిక శర్మ, హరిణిగా నటించిన ఇవానాలు మాట్లాడుతూ సింగిల్ చిత్రాన్ని ఇంత అపూర్వంగా ఆదరిస్తున్నందుకు ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు.

గోదావరి డెల్టా సిస్టమ్ సీఈగా శ్రీరామకృష్ణ

ధవళేశ్వరం, మే 13 (ఆంధ్రజ్యోతి): గోదావరి డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీర్‌గా ఆర్.శ్రీరామకృష్ణ నియమితులయ్యారు. డెల్టా సీఈగా విధులు నిర్వహిస్తున్న కృష్ణారావు ఏప్రిల్ నెలాఖరున పదవి విరమణ చేయడంతో విజయవాడ హైడ్రాలజీ విభాగంలో ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న శ్రీరామకృష్ణకు డెల్టా సీఈగా అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఈ నెల 5న బాధ్యతలు స్వీకరించారు. కాగా మంగళవారం పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బుధవారం పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టనున్నారు.

నిడదవోలులో మంత్రి త్రయం



మంత్రి సత్యప్రసాద్‌కు కోట సత్తెమ్మ తల్లి చిత్రపటం అందజేస్తున్న మంత్రి దుర్గేష్, చిత్రంలో మరో మంత్రి రవికుమార్

నిడదవోలు, మే 13 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులోని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కార్యాలయంలో మంగళవారం ఆయనను రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. మంత్రులు సత్యప్రసాద్, రవికుమార్ నిడదవోలు విచ్చేసిన సందర్భంగా మంత్రి దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. వారికి దుర్గేష్ కోటసత్తెమ్మ అమ్మవారి చిత్రపటాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా వారి వెంట మునిసిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, జనసేన పార్టీ అధ్యక్షుడు రంగా రమేష్, బొర్రా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తోగుమ్మిలో చండీహోమం

కొవ్వూరు, మే 13(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం తోగుమ్మి గ్రామంలోని కొత్తపేటలో విజయదుర్గాదేవి ఆలయంలో చండీహోమం నిర్వహించారు. ఆలయ దశమ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆలయార్చకులు మాజీ వైస్ ఎంపీపీ మద్దిపాటి సత్యనారాయణ, నాగసూర్యకుమారి దంపతులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చండీ హోమం జరిపించారు. తదుపరి భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



ఉడతకు సాయం

ఎండలకు మూగజీవాలు మాడిపోకుండా పలువురు నీరు, ఆహారం ఇచ్చి కాసింత సాయం చేస్తుంటారు. కాకినాడ వివేకానంద పార్కులో అలా ఏర్పాటు చేసిన నీరు తాగి, ఆహారాన్ని తింటూ ఓ ఉడత ఇలా కనిపించింది.

– ఫొటోగ్రాఫర్, కాకినాడ

నేత్రపర్వం

సత్యదేవుడి శ్రీ పుష్పయాగం

- పలు జాతుల సుగంధభరిత పుష్పాలతో అర్చన
- విశేష పదార్థాలు, మధురఫలాలు నివేదన
- ముగిసిన దివ్య కల్యాణోత్సవాలు

అన్నవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా చివరిరోజైన మంగళవారం శ్రీ పుష్పయాగం నేత్రపర్వంగా జరిగింది. రాత్రి 7.30కి నవదంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను, పెళ్లి పెద్దలైన సీతారాములను మంగళవాయిద్యాల నడుమ వేడుక జరిగే నిత్య కల్యాణమండపం వద్దకు తోడ్కొనివచ్చారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేర్వేరు వేదికలపై ఆశీనులు గావించి ప్రదానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి నరసింహమూర్తి ఆధ్వర్యంలో రుత్విక్‌లు గణపతిపూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నవదంపతులను వివిధ సుగంధభరిత పుష్పాలతో తీర్చిదిద్దిన ఊగుటూయలలో శేషపాన్పుపై పవళించే విష్ణుమూర్తిగా సత్యదేవుడను, ఆయన పాదాలు సుతిమెత్తగా ఒత్తుతున్న దేవిగా అమ్మవారిని అలంకరించి వేడుక కోసం తీసుకొచ్చిన వివిధ జాతుల పుష్పాలతో అష్టోత్తర శతసహస్ర నామాలతో అర్చకస్వాములు అర్చించారు. ఈ సందర్భంగా వివిధ రకాలైన తీపిపదార్థాలు, మదురఫలాలను నివేదించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అందించారు. భక్తులు ఈ వేడుకను ఊగుటూయలకు ఎదురుగా ఏర్పాటుచేసిన అద్దంలో వీక్షించి పునీతులయ్యారు. అనంతరం దంపతులకు దంపతీతాంబూలాలు కార్యక్రమానికి హాజరైన మహిళా భక్తులకు రవికవస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పాల్గొన్నారు. వైదిక కార్యక్రమాలను ఇంద్రగంటి సుధీర్, ఇంద్రగంటి వెంకటేశ్వర్లు, చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి నిర్వహించారు. అన్నవరం పరిసర ప్రాంతాల నుంచి వందలాది మహిళలు హాజరయ్యారు. ఈ వేడుకతో సత్యదేవుని విశ్వావసు నామసంవత్సర కల్యాణోత్సవాలుముగిశాయి.



పుష్పాలతో తీర్చిదిద్దిన ఊగుటూయలలో విష్ణుమూర్తిగా సత్యదేవుడు, మహాలక్ష్మిగా అనంతలక్ష్మి

'సురుచి' మిఠాయిలు

మండపేట, మే 13(ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి శ్రీపుష్పయాగానికి కోనసీమ జిల్లా తాపేశ్వరం సురుచి మిఠాయిల తయారీసంస్థ 9రకాల మిఠాయిలను అందజేసినట్టు సంస్థ యాజమాని పోలిశెట్టిమల్లి ఖార్జునరావు (మల్లిబాబు) తెలిపారు. తాపేశ్వరంలో మిఠాయిలకు ప్రత్యేక పూజలు అనంతరం అన్నవరానికి తీసు కెళ్లారు. గత ఐదేళ్ల నుంచి స్వామికి మిఠాయి ప్రసాదాన్ని అందిస్తున్నామని మల్లిబాబు చెప్పారు.



శ్రీపుష్పయాగానికి సురుచి సంస్థ సమర్పించిన మిఠాయిలు



స్వామి,అమ్మవార్లకు నివేదించిన మధురఫలాలు, విశేష పదార్థాలు



పుష్పార్చన కోసం వివిధ జాతుల పుష్పాలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

భయపెట్టేసింది!

ముమ్మిడివరంలో తాచుపాము హల్‌చల్

ముమ్మిడివరం, మే 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలోని ఓ గృహంలో తాచుపాము హల్‌చల్ చేసి అక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. తిరుపతి చిన్నీ నివాసం గృహంలోకి తాచుపాము చేరి హల్‌చల్ చేయడంతో ఇంట్లోనివారు, చుట్టుపక్కలవారు భయభ్రాంతులకు గురయ్యారు. స్నేక్‌క్యాచర్ గణేష్‌వర్మకు గృహయజమాని చిన్నీ సమాచారం అందించడంతో పామును చాకచక్యంగా బంధించాడు. వేసవి తాపానికి పాములు బయటికి వస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వర్మ సూచించాడు. పాము కనిపిస్తే తనకు సమాచారం అందించాలని, వాటిని ఎవరూ చంపవద్దని విజ్ఞప్తి చేశాడు.



తాచుపామును పట్టుకున్న స్నేక్‌క్యాచర్ గణేష్‌వర్మ

సీబీఎస్ఈ 10, ప్లస్2 ఫలితాల్లో 'శ్రీ ప్రకాష్' విద్యార్థుల విజయకేతనం

తుని రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ ప్రకటించిన పదో తరగతి, ప్లస్2 ఫలితాల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధించారని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయప్రకాష్ తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో ఎన్.సత్యసాయి 483/500, ఎం.యశస్వి 482/500, పి తరుణ్‌కుమార్ 481/500, ఎస్.రఘునందన్ 478/500 మార్కులతో అగ్రగాములుగా నిలిచారని తెలిపారు. ప్లస్2 ఫలితాల్లో జి.సాయి అనీష్ 469/50, ధాత్రి నిహారిక 466/500 సాధించి అగ్రగాములుగా నిలిచారని, నూటికి నూరుశాతం ఉత్తీర్ణతా శాతంతో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో తమ విద్యార్థులు 100కి 100 మార్కులు సాధించడం హర్షణీయమన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకె.నరసింహారావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.



ప్లస్2 ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన జి.సాయిఅనీష్, ధాత్రి నిహారిక



పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఎస్.సత్యసాయి, ఎం.యశస్వి, పి.తరుణ్‌కుమార్, ఎస్.రఘునందన్

ఇసుక ట్రాక్టర్ బోల్తా : యువకుడి మృతి

కేసు లేకుండా బాధిత కుటుంబ సభ్యులతో రాజీకి యత్నం



బోల్తా పడి ఉన్న ట్రాక్టర్

ఎటపాక, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ తరలింపు వ్యవహారంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ మీదపడి ఓ గిరిజన యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి అల్లూరి జిల్లా ఎటపాక మండలం రాయనపేట వద్ద నూతనంగా కల్వర్టు నిర్మాణం జరుగుతున్న సమీపంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇసుక దందా చేస్తున్న ఎటపాకకు చెందిన ఓ వ్యక్తి తన ట్రాక్టర్లతో అర్ధరాత్రి రాయనపేట గోదావరి నదీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను భద్రాచలానికి రవాణా చేస్తున్నాడు. అయితే అర్ధరాత్రి అప్పటికే ఒకసారి భద్రాచలానికి ఇసుక రవాణా చేసి మరోమారు గోదావరిలోకి ఇసుక లోడు కోసం వస్తున్న క్రమంలో రాయనపేట వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి సుమారు 8 అడుగుల కిందకు పల్టీలు కొడుతూ బోల్తా పడింది. ఆ సమయంలో డ్రైవర్ పక్కనే కూర్చొని ఉన్న రాజుపేట గ్రామానికి చెందిన కోడి చరణ్ (16) ట్రాక్టర్‌తో పాటు కింద పడిపోయాడు. దీంతో ట్రాక్టర్ మీద పడి చరణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ అప్రమత్తమై ట్రాక్టర్ పై నుంచి దూకేయడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించే చరణ్ మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఈ ఘటనపై ఎటువంటి కేసు లేకుండా ఉండేందుకు ఇసుక దందా సాగించే సదరు వ్యక్తి బాధిత కటుంబ సభ్యులతో రాజీయత్నాలు చేసినట్టు తెలుస్తోంది. ఇందుకు బాధిత కుటుంబానికి రూ.2లక్షలు ఇచ్చేందుకు అంగీకరించినట్టు సమాచారం. అయితే ఈ ఘటనపై ఏ ఫిర్యాదు అందలేదని ఎస్ఐ అప్పలరాజు తెలిపారు.



మరణించిన చరణ్ (ఫైల్)

సరదా కాస్తా విషాదం

ఏలేరు ఎడమ కాలువలో స్నానానికి దిగి విద్యార్థి గల్లంతు

- పోలీసుల గాలింపు చర్యలు
- తీవ్ర అస్వస్థతకు గురైన మరొకరు
- బయటపడిన ఇద్దరు విద్యార్థులు



పెదశంకర్లపూడి వద్ద విద్యార్థి గల్లంతైన ఏలేరు ఎడమ కాలువ



గల్లంతైన విఘ్నేష్ (ఫైల్)



చికిత్స పొందుతున్న సిరిబాబు

ప్రత్తిపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి ఏలేరు ఎడమ కాలువలో మంగళవారం సాయంత్రం నలుగురు విద్యార్థులు స్నానానికి దిగారు. వీరిలో ఒకరు గల్లంతు కాగా మరో విద్యార్థి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. మరో ఇద్దరు విద్యార్థులను స్థానికులు కాపాడారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలేశ్వరం నుంచి విశాఖపట్నం వెళ్లే ఏలేరు ఎడమ కాలువలో పెదశంకర్లపూడి వద్ద మంగళవారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన పంది వీర వెంకట సత్యనారాయణ అలియాస్ విఘ్నేష్ (14), కాకినాడ సిరిబాబు (14), ఏళ్ళ సోరాబత్తుల రాజా (14), ఏళ్ళ శివ(14) సరదాగా స్నానాలు చేసేందుకు వెళ్లారు. వారిలో విఘ్నేష్, సిరిబాబు కాలువ ఉధృతికి కొట్టుకుపోగా విఘ్నేష్ గల్లంతయ్యాడు. కాలువలోకి దిగుతున్న రాజా, శివలను స్థానికులు కాపాడి ఒడ్డుకు తీసుకొచ్చారు. సిరిబాబు అధికంగా నీళ్ల తాగేయడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారి వెంటనే ఏలేశ్వ రం ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గల్లంతైన విఘ్నేష్ ఆచూకీ తెలియరాలేదు. ఆ నలుగురు లంపకలోవ జిల్లా పరిషత్‌లో హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నారు. పెదశంకర్లపూడిలోని పంది రాంబాబు, సత్యవేణి దంపతుల ఇద్దరు కుమారుల్లో చిన్నవాడైన విఘ్నేష్ ఏలేరు ఎడ మ కాలువలో గల్లంతు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విఘ్నేష్ ఇంటికి ప్రత్తి పాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా వెళ్లి బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. సంఘటనా స్థలానికి వచ్చి విఘ్నేష్ ఆచూకీ కోసం ఉధృతంగా చర్యలు చేపట్టాలని ఏలేరు అధికారులను ఆదేశించారు. కాలువలో నీటి ఉధృతిని తగ్గించాలని సూచించారు. విఘ్నేష్ ఆచూకీ కోసం ప్రత్తిపాడు అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యల్లో పల్గొన్నారు. స్థానిక సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం సంఘటనా స్థలానికి చేరుకుని గల్లంతైన విఘ్నేష్ ఆచూకీ కోసం ముమ్మర చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రి వరకు గాలింపు చేపట్టినా విఘ్నేష్ ఆచూకీ తెలియరాలేదని, బుధవారం ఉదయం గాలింపు చేపడతామని ఎస్ఐ తెలిపారు.



సంఘటనా స్థలం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

రైలు నుంచి జారి పడి యువకుడి మృతి



మృతదేహం

తుని రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): తుని గవర్నమెంట్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధి తుని - హంసవరం రైల్వేస్టేషన్ల మధ్య తుని అతిథి కల్యాణ మండపానికి ఎదురుగా ఉన్న జీడిపిక్కల ఫ్యాక్టరీకి వెనుక గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి 20 నుంచి 25 ఏళ్ల యువకుడు మరణించినట్టు రైల్వే పోలీసులు వెల్లడించారు. మృతదేహంపై నలుపురంగు ట్రాక్, ఎడమ చేయిపై శ్రావణి అనే పచ్చబొట్టు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. తుని గవర్నమెంట్ రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరితనం భరించలేక వృద్ధుడి ఆత్మహత్య

కరప, మే 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరపలో సోమవారం రాత్రి ఒక వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరప ఎస్ఐ తోట సునీత తెలిపిన వివరాల ప్రకారం... కరప మార్కెట్ సెంటర్ వెనుక నివాసముంటున్న ఇల్ల దుర్గారావు(60)ను భార్య వదిలేయడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. గతేడాది కుమారుడు మరణించడంతో మరింత కుంగిపోయాడు. భార్య కాపురానికి రాకపోవడం, కుమారుడి మరణంతో మనస్తాపానికి గురైన దుర్గారావు తునిలో ఉంటున్న కుమార్తెకు ఫోన్ చేసి చనిపోతున్నట్టు తెలిపాడు. అనంతరం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని తనువు చాలించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సునీత తెలిపారు.

పేకాట శిబిరాలపై దాడులు

14 మంది అరెస్టు

పెద్దాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని జె.తిమ్మాపురం, జి.రాగంపేట గ్రామ శివార్లలో పేకాట శిబిరాలపై మంగళవారం దాడులు నిర్వహించినట్టు ఎస్ఐ వి.మౌనిక తెలిపారు. 14 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1,64,610నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కొత్తపల్లిలో గడ్డిమేటు దగ్ధం

కొత్తపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లికి చెందిన రైతు లొల్ల వీర వెంకట సత్యనారాయణ 8 ఎకరాల్లో గడ్డిమేటు వేసుకున్నాడు. మంగళవారం తెల్లవారుజామున గడ్డిమేటు దగ్ధమవుతోందని సమీప రైతులు సమాచారం ఇచ్చారని, చేలోకి వెళేసరికి గడ్డి బూడిదైందని రైతు వాపోయాడు. మిషన్‌తో కోయించిన గడ్డిని ఒబ్బిడి చేసేందుకు రూ.70వేలు ఖర్చయిందన్నాడు. కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పాడు.



చేనులో దగ్ధమవుతున్న గడ్డిమేటు

ఉప్పలంకలో కుటుంబంపై దాడి

చర్యలు తీసుకుంటాం : ఎస్ఐ

కరప, మే 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం ఉప్పలంక గ్రామంలో సోమవారం సాయంత్రం ఒక కుటుంబంపై పలువురు గ్రామస్తులు దాడి చేసి గాయపర్చారు. బాధితులు తెలిపిన సమాచారం ప్రకారం... ఉప్పలంకకు చెందిన సంగాని ప్రసాద్ మార్కెట్ యార్డు, రెడ్‌క్రాస్ బిల్డింగ్ వద్ద ఈ నెల 11న చెరువు రొయ్యలను ఎండబెట్టాడు. అదే గ్రామానికి చెందిన గేదెల పెద్దసత్తిబాబు తదితరులు ఎండబెట్టిన రొయ్యలను ఆటోతో తొక్కుకుంటూ పోయారు. దీనిపై ప్రసాద్, అతడి కుటుంబసభ్యులు వారిని నిలదీయగా దుర్భాషలాడారని, 12న సాయంత్రం తమ ఇంటిపైకి వచ్చి తనతో పాటు తన భార్య చిన తల్లిపై దాడి చేసి తీవ్రంగా కొట్టారని ఆరోపించాడు. తీవ్ర గాయాలైన ప్రసాద్‌ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్టు బాధితుడు ప్రసాద్ తెలిపాడు. ఎంఎల్‌సీ రిపోర్టు అందిందని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తోట సునీత తెలిపారు.



దాడిలో గాయపడిన సంగాని ప్రసాద్

భార్య, ప్రియుడిని పట్టుకున్న భర్త

కాకినాడ క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి): భర్త లేని సమయంలో గుట్టుచప్పుడుగా ప్రియురాలి వద్దకు వచ్చి వెళ్తూ వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్న వ్యక్తిని భర్త రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో వారిద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన మంగళవారం కాకినాడలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కాకినాడ నగరంలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి గుడి సమీపంలోని బాదం వారి వీధిలో నివాసముంటున్న ఓ వ్యక్తికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చొల్లంగి వద్ద రొయ్యల చెరువుల్లో పని చేస్తుంటాడు. అతడి భార్య ప్రస్తుతం ఎల్‌ఎల్‌బీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అయితే ఆమె ఓ ప్రైవేటు లా కాలేజీలో లా చదివే సమయంలో సహవిద్యార్థి బాలమణికంఠ పరిచయం అయ్యాడు. పరిచయం కాస్తా వివాహేతర సంబంధంగా మారింది. ఈ నేపథ్యంలో ఆమె భర్త డ్యూటీకీ రొయ్యల చెరువు వద్దకు వెళ్లిన సమయంలో మణికంఠ వస్తూ పోతూ ఉండేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి డ్యూటీకి వెళ్లిన భర్త తన భార్య వ్యవహారశైలిపై అనుమానం వచ్చి డ్యూటీ నుంచి ఇంటికి వచ్చి చూసేసరికి తన భార్య మణికంఠతో ఉండడాన్ని చూసి బయట తలుపునకు గడియ పెట్టి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ మజ్జి అప్పలనాయుడు ఇంటి వద్దకు చేరుకుని ఫిర్యాదు చేసిన వ్యక్తి భార్య, ఆమె ప్రియుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

ఎండాడ (విశాఖపట్నం), మే 13 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కేసులో ప్రధాన నిందితుడిని విశాఖపట్నంలోని సైబర్ క్రైం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ మోసాలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న కాకినాడకు చెందిన చీకట్ల వెంకట మణిచందు అలియాస్ చందుని కాకినాడలో అరెస్టు చేశారు. 4 స్మార్ట్ ఫోన్లు, కీపాడ్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

ఇసుక లారీ ఢీకొని రైతు మృతి



మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు



రమణ (ఫైల్)

తుని రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని వి.కొత్తూరు జంక్షన్‌లో జరిగింది. వి.కొత్తూరుకు చెందిన సూరెడ్డి రమణ (48) గ్రామంలో వి.కొత్తూరులో కూరగాయల సాగు చేసి తుని రైల్వే బజార్లో విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. మంగళవారం ఉదయం రైతు బజారుకు కూరగాయలు తరలించి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో వి.కొత్తూరు జంక్షన్‌లో విశాఖ వైపు వెళ్తున్న ఇసుక లారీ బలంగా ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన రమణ అక్కడికక్కడే మృతి చెందగా స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు లారీని అడ్డగించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ కృష్ణమాచార్యులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. రమణకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.



వేసవి సెలవులు కావడంతో చింతూరు మండలం మోతుగూడెంలో ఎండలో సైతం తమ స్నేహితులతో కలిసి చెట్ల నీడలో ఆడుకుంటూ.. సీలేరు నదిలో సేదతీరుతూ మోర్ ఎంజాయ్ అంటున్న చిన్నారుల దృశ్యాలు

మోతుగూడెం (ఆంధ్రజ్యోతి)

మడికి అంతర్‌రాష్ట్ర కూరగాయల మార్కెట్ సమయాల్లో మార్పు

ఈ నెల 20 నుంచి అమలు

ఆలమూరు, మే 13(ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి వద్ద ఉన్న అంతర్ రాష్ట్ర కూరగాయ మార్కెట్లో ఈనెల 20 నుంచి కూరగాయ అమ్మకాలు, కొనుగోళ్లలో కచ్చితమైన సమయాలు పాటించనున్నట్టు అభయాంజనేయ కూరగాయల మార్కెట్ కమిటీ కార్యదర్శి చెల్లుబోయిన సింహాచలం తెలిపారు. మార్కెట్ సమయాల వివరాలను ఆయన వివరించారు. మార్కెట్‌లో కొనుగోళ్లు, అమ్మకాలు ఉదయం నుంచి ప్రారంభమవుతుందని, మధ్యాహ్నం రెండు గంటల తరువాత మాత్రమే మళ్లీ మార్కెట్ ప్రారంభమవుతుందని ఈ విషయాన్ని రైతులు, వర్తకులు గమనించాలని ఆయన సూచించారు. ఎట్టి పరిస్థితిలోను మధ్యాహ్నం రెండు గంటల ముందు అమ్మకాలు ప్రారంభంకాదని, రైతులు ఇబ్బందులు పడి వచ్చి ఇక్కడ నిరీక్షించాలసి వస్తుందని అందువల్ల సమయాలను పాటించి మార్కెట్‌కు రావాలని సింహాచలం కోరారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

కొత్తపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): నాగులాపల్లి ఏరియా సమగ్ర రక్షిత మంచినీటి పథకం ద్వారా మండలంలోని పలు గ్రామాలకు బుధవారం తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ రమణ పేర్కొన్నారు. వాకతిప్ప సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద ప్రధాన పైపులైనుకు మరమ్మతులు చేపట్టేందుకు కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, ఉప్పాడ, అమీనబాద్ గ్రామాలకు తాగునీటి సరఫరా ఉండదని చెప్పారు



పళని సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద జనసైనికులతో ఎమ్మెల్యే నానాజీ

సైనికులకు దైవ బలం కోసం...

పళనిలో మురుగున్ స్వామికి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ పూజలు

సర్పవరం జంక్షన్, మే 13 (ఆంధ్రజ్యోతి): దేశ భద్రత కోసం పాకిస్థాన్‌పై యుద్ధం చేస్తున్న సైనికులు, ప్రధాని మోదీకి దైవ సంకల్పం, ఆరోగ్యం మెండుగా ఉండాలని కోరుతూ మంగళవారం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తమిళనాడు పళనిలో మురుగన్ స్వామి (సుబ్రహ్మణ్యస్వామి)కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాం ఉగ్ర దాడిలో మృతి చెందిన పర్యాటకులు, పాకిస్థాన్ సరిహద్దులో జరిగిన కాల్పుల్లో మృతి చెందిన సైనికులు, ప్రజల ఆత్మలకు శాంతి కలగాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు సుమారు 100 మంది జనసైనికులతో కలిసి పూజలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బుధవారం మధురై, కాణిపాకం, తిరుమలలో పూజలు జరిపిస్తామని చెప్పారు. కాకినాడ రూరల్, మండలం, కరప మండలం, కాకినాడ అర్బన్ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): మన దేశ రక్షణలో కీలకమైన సైనిక సంపత్తికి, ప్రధాని నరేంద్ర మోదీకి దేవుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని జనసేన నేత చిక్కాల దొరబాబు ప్రార్థించారు. కరపలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో మంగళవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరో నేత చిక్కాల సుబ్బారావు, జన సైనికులు పాల్గొన్నారు.



కరపలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న జనసేన నేత చిక్కాల దొరబాబు

పాదగయలో సినీ దర్శకుడు హను రాఘవపూడి పూజలు



హను రాఘవపూడికి ఆశీర్వచనం ఇస్తున్న పండితులు

పిఠాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని సీతారామం చిత్ర దర్శకుడు హను రాఘవపూడి మంగళవారం సాయంత్రం సందర్శించారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు వింజమూరి సుబ్రహ్మణ్యశర్మ, అల్లంరాజు చంద్రమౌళి క్షేత్ర ప్రాశస్త్యాన్ని వివరించి వేదాశీర్వచనం ఇచ్చారు. రాఘవపూడిని ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేయగా టెంపుల్ ఇనస్పెక్టర్ పెంటపాటి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.



జల్లూరులో వేసవి శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

'బాలల హక్కులకు భంగం కలిగితే చర్యలు'

పిఠాపురం రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల భంగం వాటిల్లినా, వారిని లైంగికంగా వేధించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటారని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి తెలిపారు. పిఠాపురం మండలం జల్లూరు, గోవిందరాజులపాలెం అంగన్వాడీ కేంద్రాల్లో జరుగుతున్న కిశోరి వికాసం వేసవి శిబిరంలో ఆమె పాల్గొని బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి, జీఎంఎస్‌కే లావణ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉప్పాడలో శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

క్రాఫ్ట్ వర్క్‌పై విద్యార్థులకు తర్ఫీదు

కొత్తపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ కొత్తపల్లి శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థులకు మంగళవారం క్రాఫ్ట్ వర్క్‌పై తర్ఫీదు ఇచ్చినట్టు కొత్తపల్లి గ్రంథాలయాధికారి తుమ్మలపల్లి జయకృష్ణ తెలిపారు. ఉప్పాడ శాఖా గ్రంథాలయ అధికారి తెలగంశెట్టి నళినీప్రియ, క్రాఫ్ట్ వర్క్ ట్రైనర్ బి.శ్రీదేవి పాల్గొన్నారు.

తాటిపర్తిలో కోడి పందేలపై దాడి

గొల్లప్రోలు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామ శివారులో కోడి పందాల శిబిరంపై ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం సాయంత్రం దాడి చేశారు. ఐదుగురిని అరెస్టు చేసి ఒక కోడిపుంజు, రెండు కోడి కత్తులు, రూ.8,020 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్ఐ తెలిపారు. కొడవలి శివారులో నిర్వహిస్తున్న ఆడు-గెలుపు జూదంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసి రూ.4,450 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ చెప్పారు.

రేపు కరపలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

కరప, మే 13 (ఆంధ్రజ్యోతి): కరప విద్యుత్ ఉప కేంద్రంలో గురువారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార మండలి (సీజీఆర్ఎఫ్) ఛైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అధ్యక్షతన ఉదయం 9 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని విద్యుత్ శాఖ ఏఈ సానా ఈశ్వరప్రసాద్ తెలిపారు.

రీ సర్వేను భూముల యజమానులు ఆహ్వానిస్తున్నారు

రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



తహసీల్దారు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యప్రసాద్. చిత్రంలో ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, మే 13 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట తహసీల్దారు కార్యాలయ నూతన భవనాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, మరో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పలతో కలిసి మంగళవారం ప్రారంభించారు. రూ.3కోట్లతో నిర్మించిన ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయ భవనాన్ని కూడా ప్రారంభించారు. మంత్రి సత్యప్రసాద్ మాట్లాడుతూ భూముల సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు చేపట్టిన రీసర్వే ప్రక్రియను భూముల యజమానులు ఆహ్వానిస్తున్నారన్నారు. సామర్లకోట శివారు అచ్చంపేట శివారున రూ.3.40 కోట్ల వ్యయంతో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు మంత్రి రవికుమార్ ఎమ్మెల్యే చినరాజప్పతో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, విద్యుత్ శాఖ ఎస్ఈ జి.ప్రసాద్, ఈఈ ఏపీఎస్పీడీసీఎల్ ప్రభాకర్, ఏడీఈ కిరణ్, తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, సీడీపీవో జి.ఉష, టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాల ఏర్పాటుకు తాను అధిక ప్రాధాన్యమిచ్చానన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రి రవికుమార్‌ను కోరారు. అంబేడ్కర్ కమ్యూనిటీ భవనం, వివేకానంద భవన్ నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. తహసీల్దారు, ఐసీడీఎస్ కార్యాలయాల ఎదుట ఉన్న ఖాళీ స్థలంలో టీడీపీ నాయకుడు యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్ సౌజన్యంతో శాశ్వత ప్రాతిపదికన పందిళ్లు వేయిస్తామన్నారు. తొలుత మంత్రులు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, డీసీసీబీ ఛైర్మన్‌గా నియమితులైన తుమ్మల రామస్వామి (బాబు), టీడీపీ నేత రాజా సూరిబాబురాజులతో కలిసి ఎమ్మెల్యే చినరాజప్ప డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రతి మార్కు కీలకమే

డీఎస్సీ అభ్యర్థులు ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకోవాలి: మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

కాకినాడ, మే 13 (ఆంధ్రజ్యోతి): పరీక్షలో ప్రతి మార్కు కీలకమేనని, డీఎస్సీ అభ్యర్థులు గతంలో చదివిన వాటిన్నంటినీ రివిజన్ చేసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు సూచించారు. యూటీఎఫ్ జిల్లా శాఖ సహాధ్యక్షుడు వీవీ రమణ అధ్యక్షతన మంగళవారం మధ్యాహ్నం సూర్యకళామందిరంలో డీఎస్సీ అభ్యర్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కేవీవీ నగేష్ ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ డీఎస్సీకి ప్రిపేరవుతున్న వారు మానసికంగా ధైర్యంగా ఉండాలన్నారు. వారి విన్నపాలను తమ పరిధిలో ప్రభుత్వానికి తెలియజేస్తున్నామన్నారు. 2014, 2018 డీఎస్సీ ప్రశ్నపత్రాలను ఒకసారి ఆన్సర్ చేయాలన్నారు. టెక్స్ పుస్తకాలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. అత్యంత జాగ్రత్తగా ఆన్సర్ చేయాలన్నారు. గత 8 నెలలుగా జరిగిన కరెంట్ అఫైర్స్ చదవాలన్నారు. కొన్ని సబ్జెక్టులను వివరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టీజీవీజీఆర్ రవి చక్రవర్తి, రాష్ట్ర పూర్వ కార్యదర్శి జి.ప్రభాకరవర్మ, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంవీవీ సాయిరామ్, ప్రధాన కార్యదర్శి కేవీవీ నాగేశ్వరరావు, జిల్లా కోశాధికారి పీఎన్‌వీ గణేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్‌వీ రమణ, జిల్లా కార్యదర్శులు తోట సీతారామయ్య, టి.రామలక్ష్మి, డి.కనకదుర్గాదేవి, నక్కా గోవిందరాజులు, ఐ.ప్రసాదరావు, నాయకులు శ్రీనివాస్, గణేష్, సురేష్, చంద్రశేఖర్, సీనియర్ నేత కె.సత్తిరాజు, సీఐటీయూ నాయకుడు పలివెల వీరబాబు పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పాల్గొన్నారు. కేఎస్ లక్ష్మణరావు పత్రికల్లో రాసిన 'సమకాలీన వ్యాసాలు' పుస్తకాన్ని కూడా ఆవిష్కరించారు.

'అన్నవరంలో భజనలకు అవకాశం కల్పించాలి'



శ్రీనివాసరావుకి జ్ఞాపిక ఇస్తున్న భజన కళాకారుల సంఘం, అన్నమయ్య కళాక్షేత్రం ప్రతినిధులు

పిఠాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మాదిరిగా అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానంలో హరేరామ నామ సంకీర్తన, భజనలకు అవకాశం కల్పించాలని కాకినాడ జిల్లా భజన కళాకారుల సంఘం, అన్నమయ్య కళాక్షేత్రం ప్రతినిధులు కోరారు. మంగళవారం వారు పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుని కలిసి జ్ఞాపిక బహూకరించి వినతిపత్రం అందజేశారు. టీటీడీ అనుబంధ ఆలయాల్లోనూ హరేరామ సంకీర్తనలకు అవకాశం ఉండాలన్నారు. తిరుమలలో 2003లో కూల్చివేసిన అన్నమయ్య గృహాన్ని తిరిగి నిర్మించేలా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ద్వారా చొరవ తీసుకోవాలని కోరారు.

శిశువులకు 'మదర్స్ మిల్క్ బ్యాంక్' శ్రీరామరక్ష



శీతలీకరణ యంత్రాన్ని ప్రారంభిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్

జీజీహెచ్ (కాకినాడ), మే 13 (ఆంధ్రజ్యోతి): నవజాత శిశువులకు మదర్స్ మిల్క్ బ్యాంక్ సేవలు శ్రీరామరక్ష అని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ అన్నారు. జీజీహెచ్‌లో నిర్వహిస్తున్న మదర్స్ మిల్క్ బ్యాంక్ కార్యకలాపాలు, నిర్వహణ తీరుతెన్నులను మంగళవారం ఆయన ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లులు చంటి బిడ్డలకు పాలు ఇవ్వలేని పరిస్థితుల్లో మాతృపాలను అందించడం ధాత్రి ఫౌండేషన్ దాతృత్వానికి నిదర్శనమన్నారు. మిల్క్ బ్యాంక్ మేనేజర్ శివ మాధవ్, సిబ్బంది శ్రమతో సేవలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. వేసవి దృష్ట్యా తల్లుల నుంచి సేకరించిన పాలను నిల్వ చేయడం కోసం నూతనంగా ఏర్పాటుచేసిన శీతలీకరణ యంత్రాన్ని డాక్టర్ విఠల్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ నూకల శ్రీనివాస్, ఎన్ఐసీయూ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రి రాంబాబు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీనివాసన్, డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ వి.వరప్రసాద్, డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

కాకినాడ సిటీ, మే 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రేచెర్లపేట మస్జిద్ ఏ అల్ ఫరాన్ కమిటీ, కాకినాడ నూర్ బాషా సంఘం, సత్య సందేశ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పార్థ డెంటల్ హాస్పటల్ సహకారంతో కంటి వైద్యుడు డాక్టర్ నవీద్ సుమారు 100 మందికి కంటి పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. మస్జిద్ అధ్యక్షుడు నయీం సిద్ధిక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నూర్ బాషా సంఘం గౌరవాధ్యక్షుడు ఎండీ జమీల్ అస్గర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





ఎన్నికల అధికారి ప్రొఫెసర్ కుమారస్వామి నుంచి ఎన్నిక పత్రం అందుకుంటున్న దొరస్వామి నాయక్

యూసీఈకే అధ్యాపకుల సంఘం అధ్యక్షుడిగా

దొరస్వామి నాయక్

జేఎన్టీయూకే, మే 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యూసీఈకే) అధ్యాపక సంఘం అధ్యక్షుడిగా లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ ప్రొఫెసర్ డాక్టర్ బీఆర్ దొరస్వామినాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈ ఏడాది మార్చిలో విడుదల చేశారు. ఈ పదవికి ఇతరులు ఎవరూ నామినేషన్ వేయకపోవడంతో దొరస్వామినాయక్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటిస్తూ పత్రాన్ని ఎన్నికల అధికారి ప్రొఫెసర్ ఎం.కుమారస్వామి అందజేశారు. నాయక్‌ను జేఎన్టీయూకే వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్, రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మోహన్‌రావు డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు.



సౌండ్ సిస్టమ్ ఓనర్స్, హెల్పర్స్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

నూతన కార్యవర్గం... ఏకగ్రీవం

కాకినాడ సిటీ, మే 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్, రూరల్ నియోజకవర్గాల సౌండ్ సిస్టమ్ ఓనర్స్, హెల్పర్స్ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షుడు నడికట్ల లోవరాజు అధ్యక్షతన ఆనందభారతి గ్రౌండ్ జిమ్ భవనం హాలులో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దుత్తుర్తి శ్రీను, ఉపాధ్యక్షులుగా కొప్పిశెట్టి నాగబాబు, పెమ్మాడి నాగు, కూరపాటి సత్తిబాబు, కిషోర్, కార్యదర్శిగా దువ్వ చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శులుగా బచ్చల మోహన్, రాయుడు శ్రీను, వంకా సింహాద్రి, కోశాధికారిగా సింగర్ సునీల్, సంయుక్త కోశాధికారిగా వరసాల రాజేష్, పది మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా ఊబ ప్రేమ్, అనుసూరి విజయకుమార్, పి.పుల్లారావు, ముమ్మిడి విజయబాబు వ్యవహరించనున్నారు. ముఖ్య అతిథులుగా జిల్లా సంఘ ప్రతినిధులు కుక్కల గణిరాజు, నక్కా కృపారావు, వడ్డే రాజు, మల్లాడి సత్తిబాబు, పెంకే మారయ్య, డింగ్ రాజు విచ్చేశారు. అధిక సంఖ్యలో ఓనర్స్, హెల్పర్స్ పాల్గొని ఇన్సూరెన్స్ పాలసీలు నమోదు చేయించుకున్నారు.



వేట్లపాలెం ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న ఐడీసీ కార్యాలయ ప్రత్యేక బృందం సభ్యులు

ఎత్తిపోతల పథకాల పరిశీలన

సామర్లకోట, మే 13 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఐడీసీ కార్యాలయం నుంచి ప్రత్యేక బృందం మంగళవారం మండలంలోని వేట్లపాలెం, పెదబ్రహ్మదేవం గ్రామాల్లో ఎత్తిపోతల పథకాలను సందర్శించి ఆయకట్టు రైతులతో సమీక్షించింది. వేట్లపాలెం ఎత్తిపోతల పథకం పైప్‌లైన్లు, పంపులు, మోటార్లు, విద్యుత్ ప్యానెల్ బోర్డులు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పులను ప్రాథమికంగా గుర్తించింది. ఈ పథకంలో అంతర్భాగమైన రాయభూపాలపట్నం రాగమ్మచెరువుకు కూడా ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని పంపింగ్ చేసేందుకు పైపులు ఏర్పాటు చేయాలని ఎత్తిపోతల పథకం ఆయకట్టుదారుల సంఘ ప్రతినిధి వేగుళ్ల బాబ్జీ అధికారులను కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వెంకట్రావు, రాంబాబు, అసిస్టెంట్ ఇంజనీరు సురేంద్ర, సాంకేతిక నిపుణులు ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం బృంద సభ్యులు జి.మేడపాడు, పెదబ్రహ్మదేవం, ఇళ్లపల్లి, దోమాడ ఎత్తిపోతల పథకాలను పరిశీలించి నివేదికలు రూపొందించారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వ్యయ ప్రతిపాదనలు తయారు చేస్తామని చెప్పారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'నవోదయ' విద్యార్థుల ప్రతిభ

పెద్దాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ ఫలితాల్లో నవోదయ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. కోరాడ సత్యానందం (97.4), జన్యం సాయి (94.6), కొల్లు మహిత (94.6) శాతం మార్కులు సాధించారన్నారు. 2024-25 సంవత్సరం ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో పాలబోలు నందగోపాల్ 90 శాతం, కారెడ్ల ప్రసాద్ 90 శాతం, ఎల్లమిల్లి ప్రియదర్శి కౌషిక్ 88 శాతం సాధించారు.

'మహిళలపై దాడులు పెరుగుతున్నాయి'

పిఠాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరుగుతున్నా నిరోధించడంలో ప్రభుత్వం విఫలమైందని వైసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత విమర్శించారు. ప్రభుత్వం పోలీసులను వినియోగించి వైసీపీ నేతలపై దాడులకు పాల్పడుతోందని, మాజీ మంత్రి విడదల రజనిపై సీఐ దౌర్జన్యానికి దిగడమే నిదర్శనమన్నారు. తాడేపల్లిలో జరిగిన వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర సమావేశంలో వీటిపై చర్చించామని చెప్పారు.

వాహనాల ఆకస్మిక తనిఖీ

కాకినాడ రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్ పరిధి గ్రామాల్లో ఇటీవల చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాలు అధికమయ్యాయి. వీటిని అరికట్టే చర్యల్లో భాగంగా రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆదేశాల మేరకు చీడిగ వంతెన వద్ద మంగళవారం రాత్రి వాహనాలను తనిఖీ చేసినట్టు ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు. నెంబరు ప్లేట్లు లేని ఏడు వాహనాలను ఏఎస్ఐలు, కానిస్టేబుల్స్, సిబ్బంది గుర్తించారు.

ఎస్సీ రుణాల ఎంపికకు నేడు ఇంటర్వ్యూలు

గొల్లప్రోలు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి స్వయం ఉపాధి పథకాలకు రుణాలు నిమిత్తం దరఖాస్తు చేసుకున్న వారు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఎంపీడీవో కర్రి స్వప్న సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు రైస్ కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, మొబైల్ నెంబరు, కుల ధ్రువకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు రుణం మంజూరుకు కావాల్సిన సర్టిఫికెట్లను సంబంధిత సచివాలయంలో బుధవారంలోగాఅందించాలని కోరారు.

రేపు పిఠాపురంలో రక్తదాన శిబిరం

పిఠాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): తలసీమియా చిన్నారుల కోసం గురువారం పిఠాపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు తహసీల్దారు వీవీ గోపాలకృష్ణ తెలిపారు. రక్తదాతలు, వివిధ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు శిబిరంలో పాల్గొనాలన్నారు.

రేపు డయల్ యువర్ డీఎం

ఏలేశ్వరం, మే 13 (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ డిపో కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తామని ఏలేశ్వరం డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ తెలిపారు. ప్రయాణికులు తమ సూచనలు, సలహాలు తెలిపేందుకు 9959 225532 నంబరుకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సంప్రదించాలని కోరారు. ప్రయాణికులు ఇచ్చే సూచనలు అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల భవనం

● పట్టించుకోని అధికారులు


శిథిలావస్థకు చేరుకున్న లచ్చిగూడెం ప్రభుత్వ పాఠశాల భవనం

చింతూరు, మే 13(ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లుగా ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రభుత్వ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. చింతూరు మండలం లచ్చిగూడెంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిస్థాయి మరమ్మతులకు గురైంది. మరికొద్ది రోజుల్లోనే పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి. అధికారులు లచ్చిగూడెం పాఠశాల భవన పరిస్థితిని మెరుగుపర్చే చర్యలు చేపట్టకపోవడం విడ్డూరం. ఈపాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో మొత్తం 29మంది విద్యార్థులు చదువుతుండగా వీరిలో 14మంది బాలురు, 15 మంది బాలికలు ఉన్నారు.

పాముగండిలో ప్రత్యేక వైద్య శిబిరం


పాముగండి గ్రామంలో వైద్య సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో శిరీష

దేవీపట్నం, మే 13(ఆంధ్రజ్యోతి): గత నెల రోజుల నుంచి పాముగండి గ్రామంలో అంతుచిక్కని వ్యాధితో సుమారు 40 మందికిపైగా బాధపడ్డారు. ఈ విషయం ఆంధ్రజ్యోతి దృష్టికి వెళ్లడంతో ఈనెల 5వ తేదీన పాముగండిలో అంతుచిక్కని వ్యాధి శీర్షికన వెలువడింది. దీంతో ఆ గ్రామంలో డివిజనల్ వైద్యాధికారులు ఆదేశాలతో రెండురోజుల క్రితం గ్రామంలో పర్యటించి సర్వే నిర్వహించి ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో సోమవారం, మంగళవారం రంపచోడవరం అడిషనల్ డీఎం అండ్‌హెచ్‌వో ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 23మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. వైద్య శిబిరంలో సర్పంచ్ కోట్ల శివారెడ్డి, డాక్టర్ అపూర్వ, పీహెచ్ఎన్ రాఘవమ్మ, ఎంపీహెచ్ఈవో వెంకటేశ్వర్లు, హెచ్‌వీ లక్ష్మి, ఎంటీఎస్ రామన్నదొర, హెల్త్ అసిస్టెంట్ బంగారయ్య, ఏఎన్ఎంలు సుజాత, చామంతి, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

భారతి ట్రైబల్ సొసైటీ
అధ్యక్ష కార్యదర్శులుగా వీణ, నీలవేణి ఎంపిక


అధ్యక్ష కార్యదర్శులు సోయం వీణ, రవ్వ నీలవేణి

చింతూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): ది భారతి ట్రైబల్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శుల ఎంపిక మంగళవారం జరిగింది. సొసైటీ అధ్యక్షురాలిగా సోయం వీణ, కార్యదర్శిగా రవ్వ నీలవేణిలతో పాటు మరో ఎనిమిది మంది సభ్యులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు సోయం వీణ మాట్లాడుతూ ఎంఎస్ఎం ఈ ప్రోగ్రాం స్ఫూర్తి పేరిట ఏర్పాటుచేసిన పాలి హౌజ్ పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈమేరకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం కోరనున్నట్లు వీణ తెలిపారు. తమ ప్రాజెక్టు ద్వారా ఎటువంటి క్రిమి సంహారక మందులు వినియోగించకుండా చేపట్టనున్న కూరగాయల సాగుతో పలు గిరిజన కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశంతోపాటు వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు అందించే అవకాశం ఉందన్నారు.

జేకే ట్రస్ట్ ఆధ్వర్యంలో
బోరింగ్‌లకు మరమ్మతులు


కొత్తపల్లి గ్రామంలో మోటార్‌కు మరమ్మతు చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, మే 13 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో కొత్తపల్లి పంచాయతీలో కొత్తపల్లి గ్రామంలో సుమారు 5నెలల నుంచి మంచినీరు లభించక గిరిజనులు నానా ఇబ్బందులు పడ్డారు. దీంతో మాజీ సర్పంచ్ కర్రం లక్ష్మయ్య జేకే ట్రస్ట్ అధినేత జమాల్‌ఖాన్‌కు తమ బాధను విన్నవించుకున్నారు. దీంతో ఆయన బోరింగ్‌ను మరమ్మతు చేయించారు. అక్కడ ఒక మోటారు ఐదుబోర్డులు మరమ్మతు చేస్తామన్నారు. దీంతో కొత్తపల్లి గ్రామంలో బోరింగ్‌లు వేముల రాయి కూడా ఒక బోరు మరమ్మతు చేయడంతో నీళ్లు వస్తున్నాయి.

ప్రాణాలు బలిగొంటున్న
ఇసుక మాఫియాను అరికట్టాలి

ఎటపాక మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలు బలిగొంటున్న ఇసుక అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని, ఇసుక అక్రమ రవాణాను నిలువరించడంలో అధికారులు విఫలమవుతు న్నారని సీపీఎం నాయకుడు ఐ.వెంకటేశ్వర్లు ఆరోపించారు. రాయనపేట వద్ద ఇసుక అక్రమ తరలింపు వ్యవహారంలో ప్రమాదవశాత్తూ మృతి చెందిన కోడి చరణ్ మృతిపై విచారం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంగా రాయనపేట, గుండాల, ఎటపాక, తదితర ప్రాంతాల నుంచి యథేచ్ఛగా ఇసుక దందా నడుస్తోందని తెలిపారు. ఇసుక మాఫియా చేతుల్లో కూలీకి వెళ్లే గిరిజన యువత బలౌతున్నారని, ఇసుక మాఫియా నడిపే వ్యక్తులు లక్షల రూపాయల సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. భద్రాచలం పట్టణంలో నిర్మించే కట్టడాలకు ఏపీ ఇసుకను వినియోగిస్తున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ ఎటపాకలో సాగుతున్న ఇసుక మాఫియాపై దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలని, లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు.

జీవో నెం.3 పునరుద్ధరణ చర్యలపై హర్షం

రంపచోడవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): జీవో నెం.3 పునరుద్ధరణకు చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడం హర్షణీయమని ఆదివాసీ జేఏసీ నాయకులు కంగల శ్రీనివాసు, మద్దేటి జగన్నాధరెడ్డి, కడబాల రాంబాబు, దుర్ల, మట్ల కృష్ణారెడ్డి, కుంజం అగ్గిదొర, కారం రామన్నదొర, మడకం ప్రసాద్, చవలం శుభకృష్ణ, కత్తుల రమణారెడ్డి, పొడియం శ్రీనుబాబు, పండా పవన్‌కుమార్ అన్నారు. గిరిజన శాఖ సమీక్ష సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు ఏజెన్సీ ప్రాంతంలో నూరుశాతం స్థానిక గిరిజనులకే కేటాయిస్తామని, గిరిజన సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ట్రైబల్ అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేయాలని, జీవో నెం.3 పునరుద్ధరణలో భాగంగా ఏజెన్సీ నియామకాల చట్టాన్ని రూపొందించి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలన్నారు. లేనిపక్షంలో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామన్నారు.

ప్రజలకు వైద్య సేవలందేనా..

వజ్రకూటంలో అసంపూర్తిగా విలేజ్ క్లినిక్ భవన నిర్మాణం

శంఖవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం విలేజ్ క్లినిక్ అంటూ హడావుడిగా భవనాల నిర్మాణం ప్రారంభించింది. చిత్తశుద్ధి లేకపోవడంతో భవనాలు పూర్తి చేయకపోవడంతో ఇప్పుడు అవి అసంపూర్తిగామి గిలిపోయాయి. ఇలాంటి కోవలో ఉన్న వజ్రకూటంలో భవనం పూర్తయితే నెల్లిపూడితో పాటు వజ్రకూటం గ్రామానికి వైద్యసేవలందుతాయి. నెల్లిపూడి సచివాలయం ప్రజల వైద్యసేవలకు సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదమల్లాపురం ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు వజ్రకూటంలో పూర్తికాని విలేజ్ క్లినిక్ భవనాన్ని పూర్తి చేసి ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.


వజ్రకూటంలో పూర్తికాని విలేజ్ క్లినిక్ భవనం

నూకాలమ్మ ఆలయ
అభివృద్ధికి కృషి

రౌతులపూడి, మే 13 (ఆంధ్రజ్యోతి): నూకాలమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మంగళవారం రౌతులపూడిలో నూకాలమ్మ ఆలయానికి విచ్చేసి దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ శిఖర ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు, జగదీష్, గవిరెడ్డి గురునాధ్, దేవుళ్లు, పసగడుగుల రమణ పాల్గొన్నారు.


భోజనాలు వడ్డిస్తున్న జనసైనికులు

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో
అన్నదానం

జగ్గంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రతి మంగళవారం జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. ఈ వారం కూడా అన్నదానం జరిగింది. కార్యక్రమంలో సత్తి సోమరాజు, కురుమల్ల నాగేశ్వరరావు, డ్రిల్ మాస్టారు, సతీష్, శ్రీను ఇతరులు పాల్గొన్నారు.


నర్సులకు అన్నదానం చేస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ సౌమ్య

నర్సులకు అన్నదానం

ప్రత్తిపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రిలో నర్సులకు మంగళవారం ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ సౌమ్య మంగళవారం అన్నదానం నిర్వహించారు. నర్సుల దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలోని నర్సులు క్యాండిల్ ప్రదర్శన నిర్వహించారు. వైద్య సేవలు అందించడంలో నర్సులు రేయిబంవళ్ళు శ్రమిస్తున్న తీరును పలువురు ప్రసంశించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించే నర్సులకు డాక్టర్ సౌమ్య బహుమతులు అందజేశారు.


అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

అగ్ని ప్రమాద బాధితులకు
ఆర్థికసాయం

తుని రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): దొండవాక పంచాయతీ సీహెచ్ అగ్రహారం గ్రామానికి చెందిన పేదల ఇల్లు ఇటీవల అగ్నిప్రమాదంలో పూర్తి కాలి బూడిదయ్యాయి. కట్టుబట్టలతో బాధితులు నిలిచారు. ఎవాంరి కష్టాన్ని తెలుసుకున్న ఇన్‌స్టాగ్రామ ఇన్ఫ్యూయర్ బృందావనం రాజు బాధితుల కష్టాన్ని ఒక వీడియో రూపంలో తెలియజేశాడు. దీంతో మనసున్న మనుషులు ప్రతి ఒక్కరు స్పందించారు. తలోకొంత సాయం చేశారు. అలా మొత్తం రూ.1.90లక్షల అయ్యాయి. ఆ మొత్తానికి శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ రూ.10వేలు జత చేయడంతో మొత్తం రూ.2లక్షలు అయ్యాయి. ఆ సొమ్మును మంగళవారం రణస్థలం రాయల్ మెక్ రమణ ఆధ్వర్యంలో బాధితులకు అందించారు.ఈ కార్యక్రమంలో కాకినాడ రాజేష్, యాక్టర్ ప్రసాద్, శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ ఫౌండర్ ఎస్ఎస్ఆర్ తదితరులు పాల్గొన్నారు.


ఏలేశ్వరం గ్రంథాలయంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

సాంస్కృతిక కార్యక్రమాలపై
విద్యార్థులకు అవగాహన

ఏలేశ్వరం, మే 13 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక కార్యక్రమాలపై విద్యార్థులకు స్థానిక గ్రంథాలయంలో శిక్షణ ఇచ్చారు. మంగళవారం గ్రంథాలయాధికారి కవికొండ సత్యన్నారాయణ నేతృత్వంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా పిఠాపురానికి చెందిన ఎన్.చక్రవర్తి భరత నాట్యం, కటక్, కూచిపూడిపై శిక్షణ తరగతులు నిర్వహించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



కిర్లంపూడిలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు. పక్క చిత్రంలో గండేపల్లి మండలం తాళ్లూరు జాతీయ రహదారి పక్కన శీతల పానీయాలు తాగుతున్న ప్రయాణికులు

ఎండలు బాబోయ్...ఎండలు

కిర్లంపూడి, మే 13(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగి ప్రజలు అల్లాడిపోతున్నారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. వివిధ పనుల నిమిత్తం ఇళ్ల నుంచి బయటకు వచ్చేవారు ఎండ బారిన పడకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రోడ్లపై మంచాలు వేసి వడియాలు వంటివి ఎండబెట్టుకుంటున్నారు.

గండేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలో గత రెండు రోజులుగా ఎండల తీవ్రతకు ప్రజలు విలవిల్లాడుతున్నారు. వాహనదారులు ఎండ వేడిమి తట్టుకోలేక ఎక్కడ చెట్లు కనిపిస్తే అక్కడ వాహనాలు నిలిపివేసి చెట్ల కిందకు వెళతున్నారు. ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రయాణికులు రోడ్డు పక్కనే శీతల పానీయాలు సేవిస్తున్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి


ప్రత్తిపాడులో మాట్లాడుతున్న దువ్వా శేషుబాబ్జి

ప్రత్తిపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాస్తూ మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జి డిమాండ్ చేశారు. స్థానిక ఉషోదయ పార్కు వద్ద సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు అధ్యక్షతన మే 20 సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషుబాబ్జి మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నాటి నుంచి పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను పటిష్ఠంగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్‌కోడ్‌లు తక్షణమే రద్దు చేయాలని, మే20న కార్మిక లోకమంతా సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని... అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం వర్కర్లను నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాల న్నారు. అసంఘటిత కార్మికులకు పని భద్రత కల్పించాలని తదితర డిమాండ్లతో మే 20న నిర్వహించే సమ్మెలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో స్కీం వర్కర్ల నాయకురాళ్ళు అల్లాడి లక్ష్మి, హేమలత, సత్యనాగలక్ష్మి, అనంతలక్ష్మి, సత్యవతి, సుబ్బలక్ష్మి, రాజు, సతీష్‌కుమార్, మణికంఠ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాలను తనిఖీ చేసిన పోలీసులు


రామేశ్వరంపేటలో హాస్టల్ వద్ద పోలీసులు

గండేపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామేశ్వరంపేటలో ఉన్న 33 పురుష, ఆరు మహిళల ప్రైవేట్ హాస్టళ్లను మంగళవారం జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీని వాస్ ఆధ్వర్యంలో గండేపల్లి, కిర్లంపూడి, జగ్గంపేట ఎస్ఐలు యువి శివనాగబాబు, జి.సతీష్, టి.రఘునాధరావు సిబ్బందితో తనిఖీ చేశారు. హాస్టళ్లల్లో మత్తుపదార్థాలు, మత్తు పానియాలు ఏమైనా ఉన్నాయోనని పరిశీలించా రు. సీసీ కెమెరాలు ఎంట్రీ, ఎగ్జిట్‌ను చూశారు. హాస్టళ్లల్లో భద్రతపై ఆరా తీశారు. విద్యార్థులు మత్తుపదార్థాలకు అలవాటు పడకుండా నిఘా పెట్టాలన్నారు. ఏమైనా సమస్యలంటే వెంటనే స్థానిక పోలీసులను సంప్రదించాలని నెంబర్లను ఇచ్చారు.


కార్యవర్గం ఎన్నిక దృశ్యం

ఎంప్లాయీస్ అసోసియేషన్ యూనిట్ కార్యవర్గం ఎన్నిక

జగ్గంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీజీఈఏ) జగ్గంపేట యూనిట్ కార్యవర్గం ఎన్ని మంగళవారం మహిళా సమాఖ్య భవన్‌లో జరిగింది. గండేపల్లి పంచాయతీ సెక్రటరీ కె.ఫణీంద్రకుమార్ ప్రెసిడెంట్‌గా, తాళ్ళూరు2 వెల్ఫేర్ అసిస్టెంట్ కోడూరి ప్రసాద్ జనరల్ సెక్రటరీగా, జగ్గంపేట వీఆర్వో వల్లభశెట్టి సురేష్‌కుమార్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించారు. కార్యవర్గంలో వైస్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీలు మెడికల్ డిపార్ట్మెంట్ నుంచి శర్మ(గండేపల్లి పీహెచ్‌సీ), టి.మంగదేవి (ఏఎన్ఎంపాలెం), పి.సునీత(ఏఎన్ఎం వీరవరం), ఎంసీ సతీష్‌కుమార్(వెల్ఫేర్ అసిస్టెంట్, ఎర్రంపాలెం), సద్గురుమూర్తి (ఏవో, అగ్రికల్చర్ గండేపల్లి), జాకో అ మృత (ఏవో అగ్రికల్చర్, కిర్లంపూడి), పిడిమి రమేష్ సర్వేయర్, సీహెచ్ దివ్య రాజేష్ ఇంజనీరింగ్ అసిస్టెంట్, నారాయణ (వీఆర్వో)ఎన్నికయ్యారు. కార్యక్రమంలో (ఏపీ జీఈఏ)జిల్లా ప్రెసిడెంట్ పి.జగన్నాధం, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ రత్నరాజ్, జాయింట్ సెక్రటరీ భాను ప్రసాద్, గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి మండలాల ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

తునిలో కాకినాడ ఎంపీ జన్మదిన వేడుకలు


ఎంపీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆహారపొట్లాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తుని రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ జన్మదిన వేడుకలు తుని నియోజకవర్గ జనసేన సమన్వయకర్త చోడిశెట్టి గణేష్ ఆధ్వ ర్యంలో తుని గొల్ల అప్పారావు సెంటర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి నాయకులు మజ్జిగ, లస్సీలను పంపిణీ చేశారు.అనంతరం అన్నదాన నిర్వహించారు. పలువురికి భోజనం ప్యాకెట్లను అందించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వంగలపూడి నాగేంద్ర, వీర మహిళ శ్రావణిసాయి, చోడిశెట్టి భాస్కర్, వంగలపూడి వంశీ, వాడపల్లిరాము, దుబాసి ప్రసన్న, కోడూరి సురేష్, మీలా కొండబాబు, ప్రభాకర్, దర్గా, కరీం,పొన్నాడ నానాజీ, విజయ్, ఆనంద్,దివాణం, గోవిందరావు పాల్గొన్నారు.

హైవేపైనే దుకాణాలు

భయాందోళన చెందుతున్న కొనుగోలుదారులు

గండేపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లి గ్రామంలో ప్రతీ మంగళవారం వారపు సంత నిర్వహిస్తారు. ఈ సంతకు చుట్టుపక్కల గ్రామాలైన సుబ్బయమ్మపేట, కె.గోపాలపురం, ఉప్పలపాడు తదితర గ్రామాల నుంచి కూరగాయలు, ఇతర సామాన్లు కొనుగోలు చేసుకునేందుకు అధికసంఖ్యలో వస్తుంటారు. అయితే మార్కెట్‌లో స్థలం ఆక్రమణకు గురవడంతో దుకాణదారులు హైవేపైనే వేస్తుండడంతో వచ్చే వాహనాలకు కొనుగోలుదారులు భయాందోళన చెందుతున్నా రు. అసలే ఎన్‌హెచ్ 16 కావడంతో వాహనాల వేగానికి అడ్డూ అదుపూ ఉండదని ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందని బిక్కుబిక్కుమంటూ కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో స్థలం ఖాళీచేయించి దుకాణాలు హైవేపై లేకుండా చూడాలని కోరుతున్నారు.


మల్లేపల్లి జాతీయ రహదారిపై వెలసిన దుకాణాలు

www.andhrajyothy.com

వాహనాల ఆకస్మిక తనిఖీ

కాకినాడ రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): చీడిగ వంతెన వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేసి పలువురికి కౌన్సిలింగ్ చేసినట్టు ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు.


రామచంద్రపురంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఆపరేషన్ సిందూర్‌కి మద్దతుగా
చండీ హోమం

కిర్లంపూడి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్‌కి సిందూర్‌కి మద్దతుగా జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో కిర్లంపూడి మండలం రామచంద్రపురం సర్పంచ్ తుమ్మలపల్లి సాయిగుణశేఖర్ మంగళవారం చండీ హోమం నిర్వహించారు. శత్రుసేనలను క ట్టడి చేసి దేశాన్ని కాపాడే గొప్ప శక్తి సామర్థ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం మన దేశ త్రివిధ దళాలకు ఆ దేవుని ఆశీస్సులు ఉండాలని ఈ పూజా కార్యక్రమాలు చేపడుతున్నట్లు సాయిగుణశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.


తాటిముంజులు విక్రయిస్తున్న దృశ్యం

తాటి ముంజులకు భలే గిరాకీ

ఏలేశ్వరం, మే 13 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాటి ముంజులకు గిరాకీ ఏర్పడింది. ఇందులో నీటిని తాగడం ఆరోగ్యానికి ఎంతో మేలని వైద్యులు చెబుతున్నారు. వెట్ట ప్రాంతంలోని ఏలేశ్వరంలో ఎక్కువగా తాటిచెట్లు ఉంటాయి. గతేడాది 12 ముంజులు రూ.50 ఉండగా, ప్రస్తుతం రూ.60కు విక్రయిస్తున్నారు. ఏలేశ్వరం శివాలయం పరిధిలో ముంజులు ఎక్కువగా విక్రయిస్తున్నారు. మండలంలోని పొలాలకు 20 కిలోమీటర్ల దూరం తెల్లవారుజామున వెళ్లి ముంజుకాయలను దింపి వాటిని విక్రయిస్తున్నట్లు తెలిపారు.


బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో పూర్ణిమ

పోక్సో చట్టంపై అవగాహన

జగ్గంపేట రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ప్రాజెక్టు పరిధిలోని రాజపూడి అంగన్‌వాడీ కేంద్రం నందు కిశోర్ బాలికల శిక్షణ కార్యక్రమంలో సీడీపీవో ఎం.పూర్ణిమ ముఖ్య అతిథిగా పాల్గొని పోక్సో చట్టం, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ జి.లోవ, సూపర్‌వైజర్ ఎస్.అమ్మాజీ, ఏఎన్ఎం, ఆశాలు, వీవోఏలు, అంగన్‌వాడీ టీచర్స్ కిశోర్ బాలికలు పాల్గొన్నారు.

మంచికంటి సత్యవతి మృతికి సంతాపం

ప్రత్తిపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో ఆధ్యాత్మిక ప్రవచన కర్త దివంగత మంచికంటి వెంకటేశ్వర్లు సతీమణి మంచికంటి సత్యవతి (86) సోమవారం రాత్రి మృతి చెందారు. ఆమె భర్త మంచికంటి వెంకటేశ్వర్లు రెవెన్యూ శాఖలో ఉద్యోగిగా మరోవైపు ఆధ్యాత్మిక ప్రవచనకర్తగా, సామాజిక సేవలో ఎన్నో సేవలు అందిం చారు. మంచికంటి సత్యవతి మృతదేహానికి గ్రామపెద్దలు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఎత్తిపోతల పథకాల పరిశీలన

సామర్లకోట, మే 13 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఐడీసీ కార్యాలయం నుంచి ప్రత్యే క బృందం మంగళవారం మండలంలోని వేట్ల పాలెం, పెదబ్రహ్మదేవం గ్రామాల్లో ఎత్తిపోతల పథకాలను సందర్శించి ఆయకట్టు రైతులతో సమీక్షించింది. వేట్లపాలెం ఎత్తిపోతల పథకం పైప్‌లైన్లు, పంపులు, మోటార్లు, విద్యుత్ ప్యా నెల్ బోర్డులు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పులను ప్రాథమికంగా గుర్తించింది. ఈ పథకంలో అంతర్భాగమైన రాయభూపాలపట్నం రాగమ్మ చెరువుకు కూడా ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని పం పింగ్ చేసేందుకు పైపులు ఏర్పాటు చేయాలని ఎత్తిపోతల పథకం ఆయకట్టుదారుల సంఘ ప్రతినిధి వేగుళ్ల బాబ్జీ అధికారులను కోరారు. కార్యక్రమంలో డైరక్టర్లు వెంకట్రావు, రాంబాబు, అసిస్టెంట్ ఇంజనీరు సురేంద్ర, సాంకేతిక నిపుణులు ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం బృంద సభ్యులు జి.మేడపాడు, పెదబ్రహ్మ దేవం, ఇళ్లపల్లి, దోమాడ ఎత్తిపోతల పథకాలను పరిశీలించి నివేదికలు రూపొందించారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వ్యయ ప్రతిపాద నలు తయారు చేస్తామని చెప్పారు.